మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 20-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 321 Issue: 321

20 మే 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:46 సూర్యాస్తమయం - సా. 6:38 తిథి చవితి ఉ. 11:10 వరకు తరువాత పంచమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం ఆరుద్ర ఉ. 6:10 వరకు తరువాత పుష్యమి యోగం శూల మ. 2:11 వరకు కరణం విష్టి ఉ. 11:10 వరకు బవ రా. 9:47 వరకు వర్జ్యం సా. 5:11 నుండి సా. 6:39 వరకు దుర్ముహూర్తం ఉ. 11:46 నుండి మ. 12:38 వరకు రాహుకాలం మ. 12:12 నుండి మ. 1:49 వరకు యమగండం ఉ. 7:23 నుండి ఉ. 8:59 వరకు గుళికాకాలం ఉ. 10:36 నుండి మ. 12:12 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:10 నుండి తె. 4:58 వరకు అమృత ఘడియలు రా. 1:16 నుండి రా. 2:44 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial



## ఉద్యోగులకు గుడ్ న్యూస్..

### ఉద్యోగులు, పెన్షనర్లకు కొత్త హెల్త్ స్కీమ్

### ఎంప్లాయిూ హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు

**అన్ని ప్రభుత్వ శాఖలకు అత్యవసర ఆదేశాలు జారీ**

హైదరాబాద్, మే 19 (ఈవార్తలు): ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కొత్తగా "ఎంప్లాయిూ హెల్త్ కేర్ ట్రస్ట్"ను ఏర్పాటు చేసింది. ఈ కొత్త హెల్త్ స్కీమ్ అమల్లో భాగంగా రాష్ట్ర ఫైనాన్స్ డిపార్ట్ మెంట్ అన్ని ప్రభుత్వ శాఖలకు అత్యవసర ఆదేశాలు తరువాయి 2 వ పేజీలో...



## నిరుద్యోగులకు స్వీట్ న్యూస్..

**ప్రభుత్వ ఉద్యోగాలకు వయోపరిమితి పెంపు**

**గరిష్ఠ వయోపరిమితి మరో ఏడాది పొడిగింపు**

**సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ**

హైదరాబాద్, మే 19 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం వయోపరిమితిని మరో పదేళ్లకు పెంచింది. ఈ మేరకు సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం -2 వ పేజీలో...

# భౌ భౌ.. సైలెన్స్!




## వీధి కుక్కలు రోడ్లపై తిరగొద్దు

### దాడుల నుంచి ప్రజలు కాపాడుకోవచ్చు

### సుప్రీంకోర్టు సంచలన తీర్పు

**దేశవ్యాప్తంగా పౌరులను వణికిస్తున్న వీధి కుక్కల దాడుల ఉదంతంపై భారత సర్వోన్నత న్యాయస్థానం అత్యంత కీలక తీర్పును వెలువరించింది. వీధి కుక్కలను రోడ్లు, బహిరంగ ప్రదేశాల నుంచి పూర్తిగా తొలగించాలంటూ 2025 నవంబర్‌లో తాము ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవడానికి సుప్రీం కోర్టు స్పష్టంగా నిరాకరించింది. కుక్కల దాడుల భయం లేకుండా ప్రశాంతంగా జీవించే హక్కు దేశ పౌరులకు ఉందని స్పష్టం చేసిన న్యాయ స్థానం.. ఈ విషయంలో ప్రభుత్వాలు కేవలం మూగ ప్రేక్షకులుగా మిగిలిపోలేవని చెప్పింది.**

న్యూఢిల్లీ: అలాగే రేబిస్ సోకిన కుక్కల కారుణ్య మరణానికి కూడా అనుమతి ఇచ్చింది. ఆ పూర్తి వివరాలు మీకోసం. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా వీధి కుక్కలకు సంతానోత్పత్తి నియంత్రణ శస్త్రచికిత్సలు చేసిన తర్వాత వాటిని తిరిగి పాత ప్రాంతాల్లోనే వదిలేయాలన్న జంతు హక్కుల కార్యకర్తల వాదనను కోర్టు తోసిపుచ్చింది. కుక్కలను వేరే ప్రాంతాలకు తరలిస్తే అవి అయోమయానికి గురై మరింత హింసాత్మకంగా మారతాయని ఎన్‌జీఓలు వాదించాయి. అయితే ఈ వాదనలతో విభేదించిన ధర్మాసనం.. "క్షేత్రస్థాయిలో ఉన్న కఠిన వాస్తవాలను కోర్టు విస్మరించలేదు. దేశంలో చిన్నారులు, వృద్ధులు, అంతర్జాతీయ తరువాయి 2 వ పేజీలో...




## మందుల దుకాణ్లు బంద్

### నేడు దేశవ్యాప్తంగా సమ్మె

**ఆన్‌లైన్ ఫార్మసీలపై వ్యతిరేకత**

**హైదరాబాద్‌లోనే 16 వేల షాపులు క్లోజ్**

**ఆన్‌లైన్‌లో మెడిసిన్ అమ్ముకోవచ్చు అంటూ.. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం.. ఇటీవల తీసుకువచ్చిన కొత్త నిబంధనల పట్ల ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ (ఏఐఓసీడీ) తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే.**

న్యూఢిల్లీ/హైదరాబాద్, మే 19 (ఈవార్తలు): ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే మే 20వ తేదీన దేశంలోని అన్ని మెడికల్ షాపులను మూసివేయాలని.. ఏఐఓసీడీ పిలుపునిచ్చింది. దీంతో -2 వ పేజీలో...

# యాదగిరిగుట్టలో కూసుందం!

## గుట్టలో 23న మంత్రివర్గ సమావేశం

### సీఎం రేవంత్ కీలక నిర్ణయం.. గతంలో మేడారంలో నిర్వహణ



**ఈనెల 21వ తేదీన తెలంగాణ కేబినెట్ భేటీ జరగనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వెల్లడించింది. అయితే తాజాగా ఆ సమావేశాన్ని వాయిదా వేసింది. ఈనెల 21వ తేదీన సరస్వతి అంత్య పుష్కరాలు ఉన్న నేపథ్యంలో.. రెండు రోజుల తర్వాత నిర్వహించాలని నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలోనే మంత్రివర్గ సమావేశాన్ని హైదరాబాద్‌లోని సచివాలయంలో కాకుండా ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాలతోపాటు.. పాలనా పరమైన నిర్ణయాల్లో అత్యంత ఆసక్తికరంగా మారింది.**

హైదరాబాద్, మే 19 (ఈవార్తలు): మొదట కేబినెట్ భేటీని ఈనెల 21వ తేదీనే నిర్వహించాలని భావించినా.. ఆ రోజు సరస్వతి పుష్కరాలు ఉండటంతో ఈనెల 23వ తేదీకి మార్చింది. ఇక అదే 23వ తేదీన యాదగిరిగుట్టలో వేద పాఠశాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనుండటం గమనార్హం. మంత్రివర్గ సమావేశం అంటే రాజధాని హైదరాబాద్‌కే పరిమితం కాకుండా.. రాష్ట్ర ప్రజలకు, పుణ్యక్షేత్రాల వద్దకు ప్రభుత్వ పాలనను తీసుకెళ్లాలనే సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలో భాగంగానే ఈ సరికొత్త ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. ఇక రాష్ట్రంలోని ప్రముఖ ఆలయం, యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో కేబినెట్ భేటీని నిర్వహించడం విశేషం. ఈ నిర్ణయం వల్ల ఆధ్యాత్మిక, రాజకీయ సందేశాన్ని తెలంగాణ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తరువాయి 2 వ పేజీలో...




**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,704 |
| వెండి (కిలో): | రూ.3,00,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,075 |

## ‘నీట్’గా కానిద్దాం



### యూజీ రీ-ఎగ్జామ్‌పై మల్లగుల్లాలు

**ఏర్పాట్లపై ధర్మేంద్ర ప్రధాన్ సమీక్ష.. పరీక్ష నిర్వహణపై కీలక ఆదేశాలు**

**నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామ్ జూన్ 21న జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. కఠిన భద్రతా నిబంధనల మధ్య పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.**

న్యూఢిల్లీ: మే 3న నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్షలో అవకతవకలు, ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలు రావడంతో పరీక్ష రద్దయిన విషయం తెలిసిందే. ఆ పరీక్షకు 22 లక్షలకుపైగా విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష రద్దు కావడంతో ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ సమావేశం నిర్వహించి.. పరీక్ష నిర్వహణలో నిష్పక్షపాతం, పారదర్శకత ఉండాలని స్పష్టం చేశారు. గత పరీక్షా ప్రక్రియలో గుర్తించిన లోపాలు తలెత్తకూడదని అధికారులకు ఆదేశించారు. కఠిన పర్యవేక్షణ వ్యవస్థలపై దృష్టి పెట్టిన పరీక్షా కేంద్రాల్లో అప్రమత్తతతో రీ-నీట్‌ను పకడ్బందీగా -2 వ పేజీలో...



## బండికేం సంబంధం?

**కొడుకు తప్పు చేస్తే తండ్రికి లంకె పెడుతరా?**

**సంజయ్‌ను దింపేయాలని బీజేపీ నేతల కుట్రలు**

**టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి**

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి మద్దతుగా నిలిచారు. పిల్లలు కొన్నిసార్లు తెలియక తప్పులు చేస్తారని, కుమారుడు చేసిన తప్పును కారణంగా చూపిస్తూ తండ్రి మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు.**

హైదరాబాద్, మే 19 (ఈవార్తలు):దబండి సంజయ్ తన అధికారాన్ని ఉపయోగించి కుమారుడిని చట్టం నుంచి రక్షించే ప్రయత్నం చేసి ఉంటే తామే ముందుగా వ్యతిరేకించేవాళ్లమని ఆయన స్పష్టం చేశారు. అయితే కేంద్రమంత్రిగా ఉన్నప్పటికీ ఆయన చట్టాన్ని గౌరవించారని, ఆయన కుమారుడు స్వయంగా వచ్చి పోలీసులకు లొంగిపోయాడని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ అంతర్గత రాజకీయాలపై కూడా మల్లు రవి విమర్శలు చేశారు. సంజయ్‌కు ఇబ్బంది రావడంతో ఆయనను పదవి నుంచి దించాలని కొందరు సొంత పార్టీ నేతలే తరువాయి 2 వ పేజీలో...

### విశ్వవాణి



పిల్లుల సగటు ఆయుష్షును దాదాపు రెట్టింపు చేసే ఒక విప్లవాత్మక చికిత్సను జపాన్ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ప్రస్తుతం పిల్లుల సగటు వయసు 15 ఏళ్లు ఉండగా, ఈ కొత్త చికిత్స ద్వారా వాటిని దాదాపు 30 ఏళ్ల వరకు బతికించవచ్చని పరిశోధకులు చెబుతున్నారు.

## అట్లైతే దోస్త్ కటీఫ్

### అన్నాడీఎంకేను ప్రభుత్వంలో చేర్చుకోవద్దు

### తమిళనాడు సీఎం విజయ్‌కు సీపీఎం వార్నింగ్



**టీవీకే అధిపతి, దళపతి జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళనాడులో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడి పట్టుమని పది రోజులైనా కాలేదు.. ఇంతలోనే మిత్రపక్షాల నుంచి ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారు. తాజాగా, విజయ్‌కు సీపీఎం వార్నింగ్ ఇచ్చింది. ప్రభుత్వంలో అన్నాడీఎంకేను చేర్చుకుంటే మద్దతుపై పునరాలోచిస్తామని హెచ్చరించింది.**

చెన్నై: అన్నాడీఎంకే తిరుగుబాటు వర్గాన్ని టీవీకే ప్రభుత్వంలో భాగస్వామ్యం చేయడం ప్రజా తీర్పునకు విరుద్ధమని స్పష్టం చేసింది. డీఎంకే, అన్నాడీఎంకేలకు వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చారని వామపక్ష పార్టీ పేర్కొంది. కూటమిలో అన్నాడీఎంకే చేరితే స్వచ్ఛమైన పాలన అందిస్తామన్న టీవీకే చేసిన వాగ్దానానికి వ్యతిరేకమనితరువాయి 2 వ పేజీలో...

## ముందస్తు బరాబర్

### ఊగిసలాటలో విజయ్ సర్కారు.. ఏ క్షణమైనా కూలిపోవచ్చు

**ఎన్నికలకు సిద్ధంగా ఉండండి.. కార్యకర్తలకు ఎంకే స్టాలిన్ పిలుపు**



**తమిళనాడులో దశాబ్దాల కాలంగా సాగుతున్న ద్రవిడ పార్టీల ఆధిపత్యానికి బ్రేక్ వేస్తూ.. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధికారంలోకి వచ్చిన సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఈ కొత్త ప్రభుత్వం ఎక్కువ కాలం నిలబడదని, రాష్ట్రంలో ఎప్పుడైనా ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశం ఉందంటూ మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ సంచలన కామెంట్లు చేశారు.**

చెన్నై: ప్రస్తుతం విజయ్ ప్రభుత్వం అత్యంత బలహీనమైన పునాదులపై నడుస్తోందని.. డీఎంకే శ్రేణులంతా ఎప్పుడైనా రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఎంకే స్టాలిన్ చేసిన ఈ కామెంట్లు దేశ వ్యాప్తంగా సంచలన రేపుతున్నాయి. తమిళనాడు అసెంబ్లీలో టీవీకే తరువాయి 2 వ పేజీలో...




## పాక్ మారిపోయింది!

**పలు ప్రాంతాల పేర్లు మార్పు**

**విభజనకు ముందు పేర్లు పునరుద్ధరణ**

**కృష్ణానగర్‌గా ఇస్లాంపురా**

**పంజాబ్ ప్రభుత్వ కీలక నిర్ణయాలు**

లాహోర్: ప్రముఖుల పేర్లను పెట్టిన వీధులు, కూడళ్లు, రహదారులకు.. భారత్- పాక్ విభజనకు ముందున్న హిందూ, సిక్కు, జైన్, బ్రిటిష్ వలసరాజ్యాల కాలం నాటి పేర్లను అధికారికంగా పునరుద్ధరిస్తోంది. పాకిస్థాన్‌లో పంజాబ్ ముఖ్యమంత్రి మరియం నవాజ్ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో -2 వ పేజీలో...

# రాశి ఫలాలు

20.5.2026

మేషం: ధన పరంగా ఒడిదుడుకులు అధికమవుతాయి. వ్యాపారాలు కొంత మందకోడిగా సాగుతాయి. ఉద్యోగాలలో సహోద్యోగుల వలన ఊహించని సమస్యలు కలుగుతాయి. కుటుంబ సభ్యుల ప్రవర్తన వలన మానసిక అశాంతి కలుగుతుంది. ఋణదాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. ఆరోగ్య విషయాలలో కొంత శ్రద్ధ వహించాలి.

వృషభం: సమాజంలో పరిచయాలు విస్తృతమవుతాయి. స్థిరాస్తి వివాదాలకు సంబంధించి ప్రముఖుల నుంచి ముఖ్య సమాచారం సేకరిస్తారు. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. వృత్తి వ్యాపారాలలో లాభాలు అందుకుంటారు. ఉద్యోగాలలో ఆశించిన మార్పులుంటాయి.

మిధునం: చేపట్టిన పనులలో శ్రమ పెరుగుతుంది. ఒక వ్యవహారంలో సన్నిహితుల నుంచి అందిన సమాచారం నిరాశ కలిగిస్తుంది. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. వృత్తి వ్యాపారాలలో వ్యయప్రయాసలు తప్పవు. ఉద్యోగాలు గందరగోళంగా ఉంటాయి.

కర్కాటకం: ఆస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. మంచి మాట తీరుతో అందరినీ ఆకట్టుకుంటారు. ఇతరులకు సహాయ సహకారాలు అందిస్తారు. చేపట్టిన పనులు సజావుగా సాగుతాయి. ఆర్థిక అనుకూలత కలుగుతుంది. వ్యాపారాలు, ఉద్యోగాలలో అంచనాలు నిజం అవుతాయి.

సింహం: వృత్తి వ్యాపారాలలో స్వంత ఆలోచనలు కలసివస్తాయి. దైవదర్శనాలు చేసుకుంటారు. సన్నిహితుల నుండి శుభవార్తలు అందుతాయి. దీర్ఘకాలిక సమస్యల నుంచి బయటపడతారు. స్థిరాస్తి క్రయవిక్రయాలలో లాభాలు అందుకుంటారు. ఉద్యోగాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు.

కన్య: ప్రయాణాలలో శ్రమ మరింత అధికమవుతుంది. విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వ్యాపార లావాదేవీలు నిరాశ కలిగిస్తాయి. ఆప్తులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. ఉద్యోగాలలో చికాకులు అధికమవుతాయి. దైవదర్శనాలు చేసుకుంటారు.

తుల: ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు తప్పవు. ధన పరంగా ఒడిదుడుకులు అధికమవుతాయి. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. కుటుంబ సభ్యులు ఒత్తిడులు పెంచుతారు. వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఉద్యోగాల్లో అదనపు బాధ్యతలు వలన విశ్రాంతి ఉండదు.

వృశ్చికం: దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. సమాజంలో ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. స్థిరాస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుని పాత జ్ఞాపకాలు పంచుకుంటారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ యోగం ఉన్నది. వ్యాపార, ఉద్యోగాలు సంతృప్తికరంగా ఉంటాయి.

ధనస్సు: కుటుంబ సభ్యుల నుండి కీలక సమాచారం అందుతుంది. ఆప్తుల నుంచి అవసరానికి ధనం లభిస్తుంది. చిన్ననాటి మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. సంఘంలో విశేషమైన గౌరవ మర్యాదలు పొందుతారు. విలువైన వస్త్రాలు ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వ్యాపార ఉద్యోగాలలో సంతృప్తికర వాతావరణం ఉంటుంది.

మకరం: ఇంటా బయట పరిస్థితులు అనుకూలించవు. వ్యాపారాలలో పెట్టిన పెట్టుబడులకు తగిన లాభాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటారు. ముఖ్యమైన పనులు వాయిదా వేయడం మంచిది. ఆర్థిక ఇబ్బందులు మరింత బాధిస్తాయి. ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. దైవదర్శనాలు చేసుకుంటారు.

కుంభం: ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్రాలను సందర్శించుకుంటారు. ఆర్థిక ఇబ్బందుల వలన నూతన ఋణ ప్రయత్నాలు చేయవలసి వస్తుంది. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికమవుతుంది.

మీనం: పుణ్యక్షేత్ర సందర్శనం చేసుకుంటారు. నూతన వాహన యోగం ఉన్నది. వ్యాపారులకు నూతన పెట్టుబడులు అందుతాయి. నిరుద్యోగ యత్నాలు ఫలిస్తాయి. సంఘంలో సరైన గౌరవ మర్యాదలు పొందుతారు. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. ఉద్యోగాలలో సమస్యలను అధిగమిస్తారు.

# భౌ భౌ.. సైలెన్స్!



మొదటి పేజీ తరువాయి

పర్యాటకులు నిత్యం కుక్క కాట్లకు గురవుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు కేవలం తమ శారీరక బలం మీదో లేదా కుక్కల దయ మీదో ఆధారపడి బతకాలని మన రాజ్యాంగం ఎక్కడా చెప్పలేదు" అని పదునైన వ్యాఖ్యలు చేసింది. బహిరంగ ప్రదేశాల్లో కుక్కల సంచారం ఆందోళనకరంగా మారిందని పేర్కొంటూ.. ఆయా జంతువులను షెల్టర్ హోమ్‌లకే పరిమితం చేయాలని స్పష్టం చేసింది. ఈ సంక్షోభం ఇంతలా ముదరడానికి రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమని సుప్రీం కోర్టు మండిపడింది. కుక్కల జనాభా పెరుగుతున్నప్పటికీ.. దానికి అనుగుణంగా మౌలిక సదుపాయాలను పెంచడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని కోర్టు విమర్శించింది. ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకుండా అరకొరగా చేసిన స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ డ్రైవ్‌ల వల్ల యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) లక్ష్యం దెబ్బతిందని ధర్మాసనం పేర్కొంది.

**సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు:**

యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఏడబ్ల్యూబీఐ) రూపొందించిన నిబంధనలను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కచ్చితంగా అమలు చేయాలని తెలిపింది. ప్రతి జిల్లాలో కనీసం ఒక యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని చెప్పింది. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు, ఇమ్యునోగ్లోబులిన్స్ మందులు పుష్కలంగా అందుబాటులో ఉంచాలని పేర్కొంది. సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేస్తూ వీధి కుక్కలను పట్టుకునే అధికారులపై ఎలాంటి పోలీస్ కేసులు నమోదు చేయకూడదని చెప్పింది. అంతేకాకుండా రేబిస్ సోకిన, విపరీత ప్రవర్తన కల్గిన కుక్కల కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వాలని సూచించింది. గత ఏడాది జూలై నవంబర్ నెలల్లో ఇచ్చిన ఆదేశాల ప్రకారం.. ఆసుపత్రులు, పార్కులు, రైల్వే స్టేషన్ల వంటి పబ్లిక్ ప్లేసెస్ నుంచి కుక్కలను తొలగించి షెల్టర్లకు తరలించాల్సి ఉంటుంది. అక్కడ నిపుణుల పర్యవేక్షణలో వాటికి చికిత్స, టీకాలు అందించాలి. అలాగే బహిరంగ ప్రదేశాల్లో కుక్కలకు ఆహారం పెట్టడాన్ని కూడా కోర్టు నిషేధించింది. అధికారుల విధులను అడ్డుకునే వారిపై కఠిన చర్యలు ఉంటాయని సుప్రీం కోర్టు మరోసారి హెచ్చరించింది.

# యాదగిరిగుట్టలో కూసుందం!

మొదటి పేజీ తరువాయి

సమాచారం. అయితే ఇలా కేబినెట్ భేటీని హైదరాబాద్ బయట నిర్వహించడం ఇదేం తొలిసారి కాదు. గతంలో కూడా సీఎం రేవంత్ రెడ్డి.. మంత్రివర్గ సమావేశాన్ని మేడారంలో నిర్వహించారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన సమ్మక్క సారక్క జాతర సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మేడారంలోనే కేబినెట్ భేటీని ఏర్పాటు చేశారు. అక్కడే జాతరకు సంబంధించిన ఏర్పాట్లతోపాటు.. భక్తులకు సౌకర్యాలు, నిధుల విడుదలకు సంబంధించిన కీలక నిర్ణయాలకు ఆమోదం కల్పించారు. ఇప్పుడు కూడా అలాంటి వ్యూహాన్నే యాదగిరిగుట్టలోనూ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయం వల్ల స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకుని.. వాటిపై తక్షణమే స్పందించే అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. బాసర సరస్వతి అంత్య పుష్కరాలు ఈనెల 21వ తేదీన ప్రారంభం కానుండటంతో.. తెలంగాణ ప్రభుత్వం బాసరలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లను చేస్తోంది. ఈ వేడుకకు చాలా మంది మంత్రులు హాజరుకానుండటంతో.. ఆ రోజున కేబినెట్ భేటీని వాయిదా వేశారు.

# 'నీట్'గా కానిద్దాం

మొదటి పేజీ తరువాయి

నిర్వహించాలని చెప్పారు. అలాగే పరీక్ష ఏర్పాట్లు, భద్రతా పర్యవేక్షణ అమలుపై రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. భద్రతా చర్యలతో పాటు విద్యార్థులకు రవాణా సౌకర్యం, తాగునీరు, ఇతర అవసరమైన ఏర్పాట్లు పరీక్షా కేంద్రాల్లో ఉండాలని ప్రధాన్ అధికారులకు ఆదేశించారు.

అభ్యర్థులకు ముఖ్య సూచనలు:

- నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామ్ జూన్ 21 (ఆదివారం) నిర్వహిస్తారు.
- ప్రస్తుతం ఉన్న చిరునామా మారితే పరీక్షా నగర ప్రాధాన్యత మార్చుకోవాలనుకునే అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్లు నీట్ ఎన్‌టీఏ పోర్టల్, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ద్వారా మే 21 వరకు మార్పులు చేసుకోవచ్చు.
- విద్యార్థులు మొదటి, రెండో ప్రాధాన్యత పరీక్షా నగరాలను ఎంచుకునే అవకాశం పొందుతారు.
- ప్రస్తుతం ఉన్న చిరునామా, పరీక్షా నగర ప్రాధాన్యత మార్పులకు తప్ప ఇతర సవరణలకు అనుమతి లేదు. మే 21 తర్వాత వచ్చే వినతులను పరిగణనలోకి తీసుకోరు.
- రద్దైన పరీక్షకు చెల్లించిన ఫీజు తిరిగి ఇస్తారు. రీ-ఎగ్జామ్‌కు అదనపు ఫీజు వసూలు చేయరు.
- పరీక్ష పెన్-అండ్-పేపర్ (ఆఫ్‌లైన్) విధానంలోనే 13 భాషల్లో నిర్వహిస్తారు. అవి అస్సామీ, బెంగాలీ, ఇంగ్లీష్, గుజరాతీ, హిందీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగు, ఉర్దూ.
- పరీక్షా ప్రక్రియల నిర్వహణకు విద్యార్థులకు అదనంగా 15 నిమిషాలు ఇస్తారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు జరుగుతుంది.
- సిటీ ఇంటిమేషన్ స్లిప్‌లు, అడ్మిట్ కార్డులు, ఇతర పరీక్షా వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో తర్వాత ప్రకటిస్తామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తెలిపింది. తాత్కాలికంగా జూన్ 14 నాటికి విడుదలయ్యే అవకాశం ఉంది.
- 2027 నుంచి నీట్-యూజీని కంప్యూటర్-బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహిస్తామని ఏజెన్సీ ప్రకటించింది.
- రీ-ఎగ్జామ్ ఫలితాల విడుదల తేదీని తర్వాత ప్రకటిస్తారు.
- అప్‌డేట్లు, పరీక్షా సూచనల విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు అధికారిక ఎన్‌టీఏ సోర్సులనే నమ్మాలని అధికారులు సూచించారు.
- నీట్ (యూజీ) 2026పై మరింత సమాచారం కావాలంటే అభ్యర్థులు 011-40759000, 011-69227700 హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేయొచ్చు. లేక అవవ్‌బన్ర2026ఏఠ్ఖు.ఖఎ.అఆ కు ఈమెయిల్ పంపవచ్చు.

# బండికేం సంబంధం?

మొదటి పేజీ తరువాయి

ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ వివాదంపై స్పందిస్తూ పార్టీ నేతలు కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఎవరినీ సస్పెండ్ చేసే ఆలోచన లేదన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి, ఝాన్సీ రెడ్డి పలువురిపై ఫిర్యాదు చేశారని, రామసహాయం కృష్ణ కిషోర్ రెడ్డి, హరిప్రసాద్‌లపై తమకు ఫిర్యాదు అందిందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు ఓడిపోవడానికి కారణం ఇద్దరే అని ఫిర్యాదు అందిందని, కృష్ణ కిషోర్ రెడ్డి, హరిప్రసాద్ తమ వాదన వినిపించారని మల్లు రవి చెప్పారు. ఎమ్మెల్యేతో కలిసి కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పని చేస్తామని ఇద్దరు నేతలు హామీ ఇచ్చారని, అందరూ కలిసి పనిచేస్తే పాలకుర్తి నియోజకవర్గంలో పార్టీ బలంగా ఉంటుందని తాము చెప్పినట్లుగా మల్లు రవి అన్నారు. మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయం చైర్మన్ గా ఉన్న శ్రీకాంత రెడ్డి రెండు వర్గాలను కో ఆర్డినేట్ చేస్తారని స్పష్టం చేశారు.

**జీహెచ్ఎంసీ ఆశావహులకు వార్నింగ్**

జీహెచ్ఎంసీ కార్పొరేటర్ అభ్యర్థిగా ఎవరికి వాళ్ళు ప్రకటించుకున్నారని, యూత్ కాంగ్రెస్ నేతలు తామే పోటీ చేస్తున్నట్లు ప్రచారం చేస్తున్నట్టుగా తమ దృష్టికి వచ్చిందని మల్లు రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు చేస్తే వేటు వేస్తామని, ఎన్నికల్లో అభ్యర్థి పేర్ల ప్రకటనకు కాంగ్రెస్ పార్టీలో ఒక ప్రొసీజర్ ఉంటుందన్నారు. తానే మళ్ళీ సీఎం అవుతానని ప్రకటించే శక్తి ఉన్నవాడు రేవంత్ రెడ్డి అని మల్లు రవి అన్నారు. ఎత్తుకు పై ఎత్తులు వేసి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో మళ్ళీ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రాగలరని, సౌత్ ఇండియాలో పార్టీ బలోపేతం కోసం రేవంత్ పని చేస్తున్నారన్నారు. రేవంత్ దూకుడు అడ్డుకోవడానికే ధర్మపురి అరవింద్ ప్రయత్నం చేస్తున్నారని, సీఎం రేవంత్ ఇమేజ్ చెడగొట్టాలని చాలా మంది ప్రయత్నం చేస్తున్నారని మల్లు రవి మండిపడ్డారు.

# ముందస్తు బరాబర్

మొదటి పేజీ తరువాయి

పార్టీకి సొంతంగా 107 స్థానాలు ఉండగా.. మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతు ఉంది. దీనికి తోడు రెండు సీట్లున్న వీసీకే, రెండు స్థానాలున్న సీపీఐ, మరో రెండు సీట్లు కల్గిన సీపీఎం, ఇంకో రెండు సీట్లున్న ఐయూఎంఎల్ పార్టీలు కూడా విజయ్‌కే మద్దతు ఇస్తుండటంతో టీవీకే ప్రభుత్వం మెజారిటీని నిలబెట్టుకుంది. వీటితో పాటు గత వారం జరిగిన విశ్వాస పరీక్షలో జోసెఫ్ విజయ్ ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేసిన 25 మంది అన్నాడీఎంకే తిరుగుబాటు ఎమ్మెల్యేల మద్దతు కూడా తోడైంది. అయితే ఈ రాజకీయ సమీకరణాలు ఎంతో కాలం సాగవని డీఎంకే వర్గాలు భావిస్తున్నాయి. ఒకవేళ బయట నుంచి మద్దతు ఇస్తున్న వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్ వంటి పార్టీలు తమ మద్దతును ఉపసంహరించుకున్నా.. లేదా విపక్ష పార్టీకి చెందిన 25 మంది తిరుగుబాటు ఎమ్మెల్యేలపై స్పీకర్ లేదా కోర్టులు అనర్హత వేటు వేసినా విజయ్ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని స్టాలిన్ లెక్కగడుతున్నారు. 'ప్రస్తుత పాలన ఎప్పుడైనా పడిపోవచ్చు. బహుశా 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటే తమిళనాడు అసెంబ్లీకి కూడా మళ్లీ ఎన్నికలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి పార్టీ శ్రేణులు ఇప్పుడే రంగంలోకి దిగాలి. అన్ని రకాలుగా సిద్ధంగా ఉండాలి' అని జిల్లా కార్యదర్శుల సమావేశంలో స్టాలిన్ దిశానిర్దేశం చేశారు. గత ఎన్నికల్లో డీఎంకే ఘోర పరాజయాన్ని చవిచూడటమే కాకుండా స్వయంగా స్టాలిన్ కూడా తన కొలత్తూరు నియోజకవర్గంలో ఓడిపోవడం ఆ పార్టీని కోలుకోలేని దెబ్బతీసింది. ఈ ఓటమికి పూర్తి నైతిక బాధ్యత తనదేనని స్టాలిన్ ప్రకటించారు.

# పాక్ మారిపోయింది!

మొదటి పేజీ తరువాయి

ఈ చారిత్రాత్మక నిర్ణయానికి ఆమోదం లభించింది. ఈ మార్పుల్లో భాగంగా లాహోర్ నగరంలోని పలు కీలక ప్రాంతాలు, వీధులు పేర్లు మారిపోయాయి. ఇప్పటివరకు 'ఇస్లాంపురా'గా పిలిచిన ప్రాంతం మళ్లీ 'కృష్ణా నగర్'గా.. 'బాబ్రీ మసీద్ చౌక్' తిరిగి 'జైన్ మందిర్ చౌక్'గా మారింది. అలాగే 'సున్నత్ నగర్' 'సంత్ నగర్'గా, 'ముస్తఫాబాద్' 'ధరమ్‌పురా'గా మార్చుతూ అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. లాహోర్ నగరానికి ఉన్న భిన్న మతాలు, విభిన్న సంస్కృతుల గుర్తింపును గౌరవించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు పంజాబ్ ప్రభుత్వ అధికారి ఒకరు చెప్పారు. ఇప్పటికే నగరంలోని తొమ్మిది ప్రధాన ప్రాంతాలలో పాత పేర్లతో కూడిన కొత్త సైన్‌బోర్డులు వెలిశాయి. అయితే, అధికారిక రికార్డుల్లో వాటి పేర్లు మారినప్పటికీ స్థానికుల మనసులు, నిత్య జీవితంలో ఈ పాత పేర్లు మాత్రం ఎప్పుడూ చెరిగిపోలేదు. ఆటో డ్రైవర్లు, వ్యాపారులు, సామాన్యులు లక్ష్మీ చౌక్, దేవోస్ రోడ్, క్వీన్స్ రోడ్ వంటి పాత పేర్లనే వాడుతుండటం విశేషం. ఈ చారిత్రక నిర్ణయం కేవలం వీధుల పేర్లకే పరిమితం చేయకుండా.. మహారాజా రంజిత్ సింగ్ కాలం నాటి కట్టడాలు, పురాతన చర్చిలు, చారిత్రక క్రికెట్ మైదానాలు, మింటో పార్క్ (గ్రేటర్ ఇక్బాల్ పార్క్) లోని పాత కుస్తీ అఖారాలను కూడా పునరుద్ధరించే పనిలో ఉన్నారు. ఈ పేర్ల మార్పు వెనుక లాహోర్ హెరిటేజ్ ఏరియాస్ రివైవల్ ప్రాజెక్ట్‌కు అధిపతిగా పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ ఉన్నారని అధికారులు తెలిపారు.

# ఉద్యోగులకు గుడ్ న్యూస్..

మొదటి పేజీ తరువాయి

జారీ చేసింది. ఈ పథకం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు వైద్య భద్రత కల్పించడమే తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా కనిపిస్తోంది. ఉద్యోగుల ఆరోగ్య సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించింది. ఆర్థిక శాఖ సూచనల ప్రకారం ప్రతి ఉద్యోగి, పెన్షనర్ తమ కుటుంబ సభ్యుల వివరాలతో సహా పూర్తి డేటాను తప్పనిసరిగా సమర్పించాలి. ఈ సమాచారం భవిష్యత్తులో ఆరోగ్య సేవలు, క్యాష్‌లెస్ చికిత్స వంటి ప్రయోజనాల కోసం ఉపయోగపడుతుంది. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగుల వివరాలను ఐఎఫ్ఎంఐఎస్-హెచ్ఆర్ పోర్టల్లో మే 31వ తేదీలోపు అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. నిర్ణీత గడువులోగా సమాచారం నమోదు చేయాలని లేదంటే భవిష్యత్తులో ఆరోగ్య పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# నిరుద్యోగులకు స్వీట్ న్యూస్..

మొదటి పేజీ తరువాయి

అమలులో ఉన్న నిబంధనల ప్రకారం సాధారణ ఉద్యోగాల కోసం గరిష్ఠ వయోపరిమితి 34 సంవత్సరాలుగా ఉంది. కాగా, తాజా ఉత్తర్వులతో ఈ వయోపరిమితి 44 ఏళ్లకు పెరిగింది. ఈ వయో సడలింపు ఏడాది పాటు అమలులో ఉండనుంది. నిరుద్యోగ యువత నుంచి పెద్ద ఎత్తున వినతులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కరోనా కాలం, నియామకాల ఆలస్యం, నోటిఫికేషన్లు లేకపోవడం వంటి పలు కారణాల వల్ల చాలామంది నిరుద్యోగులు వయోపరిమితి దాటిపోయారని.. వారికి మరో అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ నియామక సంస్థలు విడుదల చేసే నోటిఫికేషన్లకు ఈ వయోసడలింపు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో తెలిపారు. అయితే ఈ సడలింపు యూనిఫాం సర్వీసులకు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేశారు. పోలీస్, ఎక్సైజ్, ఫైర్, జైలు, అటవీ శాఖల వంటి శారీరక ప్రమాణాలు అవసరమైన ఉద్యోగాలకు ఈ వయోపరిమితి పెంపు వర్తించదని పేర్కొన్నారు.

# మందుల దుకాన్లు బంద్

మొదటి పేజీ తరువాయి

ఈ నిర్ణయానికి అనుగుణంగా రేపు అన్ని రాష్ట్రాల్లోని ఫార్మసీ దుకాణాలు మూతపడనున్నాయి. ఇక ఏఐఓసీడీ ఇచ్చిన బంద్‌కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్లు మద్దతు తెలిపాయి. కేంద్రం తీసుకున్న ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. రేపు దేశం మొత్తం మెడికల్ షాప్‌లు బంద్ కానున్నాయి. ఈ మేరకు ఏఐఓసీడీ బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే బుధవారం రోజున దేశంలో ఉన్న సుమారు 12.40 లక్షల మెడికల్ దుకాణాలు, డిస్ట్రిబ్యూటర్లు.. తమ సేవలు నిలిపివేయనున్నారు. ఆన్‌లైన్ మందుల సరఫరాకు కేంద్రం ప్రభుత్వం అనుమతిస్తూ తీసుకున్న నిబంధనలను తక్షణమే రద్దు చేయాలని ఏఐఓసీడీ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ఎలాంటి పర్యవేక్షణ లేకుండా.. ఆన్‌లైన్ ఫార్మసీలు మెడిసిన్ విక్రయిస్తుండటం వల్ల నకిలీ మందుల అమ్మకాలు పెరిగిపోతున్నాయని ఆరోపిస్తున్నారు.

# అట్లైతే దోస్త్ కటీఫ్

మొదటి పేజీ తరువాయి

వామపక్ష పార్టీ వ్యాఖ్యానించింది. "తమిళనాడు మరో ఎన్నికలకు సిద్ధంగా లేదు, గవర్నర్ ద్వారా దొడ్డిదారిన బీజేపీ పాలనను మేము కోరుకోవడం లేదు కాబట్టి టీవీకేకు మద్దతు ఇస్తున్నాం" అని సీపీఎం తెలిపింది. విజయ్ ప్రభుత్వం ఏ క్షణమైనా కూలిపోతుందని, త్వరలో మధ్యంతర ఎన్నికలకు సిద్ధంగా ఉండాలంటూ డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వ్యాఖ్యలు చేసిన కొద్ది గంటల్లోనే విజయ్‌కు మిత్రపక్షం నుంచి ఈ బెదిరింపులు రావడం గమనార్హం. అన్నాడీఎంకే పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి, షణ్ముగం- వేలుమణి వర్గాలుగా చీలిపోయిన విషయం తెలిసిందే. వేలుమణి వర్గం బలపరీక్షలో విజయ్‌కు అనుకూలంగా ఓటేయడం తమిళ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రెబల్స్‌పై ఈపీఎస్ వర్గం గవర్నర్‌కు ఫిర్యాదు చేయగా.. తమదే అసలైన పార్టీ అంటూ స్పీకర్‌కు షణ్ముగం-వేలుమణి మద్దతుదారులు వినతిపత్రం సమర్పించారు. ఇదే సమయంలో తిరుగుబాటు ఎమ్మెల్యేల మద్దతు తీసుకోడానికి విజయ్ సిద్ధమయ్యారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో టీవీకే ప్రభుత్వంలోని మిత్రపక్షం సీపీఐ హెచ్చరించడం గమనార్హం. అన్నాడీఎంకే చీలిక వర్గానికి చెందిన 24 మంది బల పరీక్షకు ముందే విజయ్‌ను నేరుగా ఆఫీసుకు వెళ్లి కలిశారు. అనంతరం ఓటింగ్ లో వారు అనుకూలంగా ఓటేయడం, వీరికి కూడా ప్రభుత్వం లో చోటు కల్పిస్తారన్న ప్రచారంతో సీపీఎం అల్టిమేటం జారీచేసింది.



# గోనె సంచులూ లేకపాయే

**ముందస్తు ప్రణాళిక లేని సర్కారు.. గండ్ర వెంకటరమణారెడ్డి ధ్వజం**

భూపాలపల్లి, మే 19 (ఈవార్తలు): ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో రైతులు ఇబ్బంది పడుతున్నారంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. ముందస్తు ప్రణాళికా లోపం వల్లే అన్నదాతలు రోడ్లపై అల్లాడుతున్నారని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆరోపించారు. కనీసం గోనె సంచులు సమకూర్చడంలో కూడా రేవంత్ రెడ్డి సర్కార్ విఫలమైందని మండిపడ్డారు. ముఖ్యమంత్రికి 75 సార్లు ఢిల్లీ వెళ్లడానికి సమయం ఉంది కానీ, రైతుల కష్టాలు పట్టించుకోవడానికి తీరిక లేదని... రేవంత్ 'నకిలీ రైతు బిడ్డ' అని గండ్ర ఎద్దేవా చేశారు. క్వింటాకు 7 కిలోల తరుగు తీస్తూ రైతులను దోచుకుంటున్నారని, గతంలో కేసీఆర్ కరోనా సమయంలోనూ ప్రతి గింజా కొన్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కొనుగోళ్లు వేగవంతం చేయకపోతే బీఆర్ఎస్ తరపున పోరాటాలు ఉద్ధృతం చేస్తామని గండ్ర హెచ్చరించారు.

# 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల మెరిట్ లిస్టు విడుదల

హైదరాబాద్, మే 19 (ఈవార్తలు): ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ లిస్టును మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మంగళవారం విడుదల చేసింది. ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున (1:3) అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఆహ్వానించింది. హైదరాబాద్‌లోని వెంగల్‌రావు నగర్‌లో ఉన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రాంగణంలో ఈ నెల 22, 23 తేదీల్లో వెరిఫికేషన్ జరగనుంది. విద్యార్హత, కమ్యూనిటీ, తదితర అన్ని సర్టిఫికెట్లతో వెరిఫికేషన్‌కు హాజరు కావాలని బోర్డు పేర్కొంది. ఈ నెల 22, 23వ తేదీల్లో వెరిఫికేషన్‌కు హాజరు కాలేని వారు, ఈ నెల 25వ తేదీన వచ్చి సర్టిఫికెట్లు అందజేయవచ్చునని బోర్డు స్పష్టం చేసింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని 34 డిపార్ట్‌మెంట్లలో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి గతేడాది మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ, అనస్తేషియా డిపార్ట్‌మెంట్లలోని 174 పోస్టుల భర్తీ ప్రక్రియ ఇప్పటికే పూర్తి అయింది. ఆయా పోస్టులకు ఎంపికైన డాక్టర్లకు, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు ఇటీవలే నియామక పత్రాలు కూడా అందజేశారు. మిగిలిన 30 డిపార్ట్‌మెంట్లలోని 433 పోస్టులకు సంబంధించిన మెరిట్ లిస్ట్‌ను మంగళవారం విడుదల చేశారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం, ఉద్యోగాలకు ఎంపికైన డాక్టర్ల జాబితాను విడుదల చేస్తామని బోర్డు తెలిపింది.

# పాలమూరు జల్దీ అయిపోవాలె

**భూ సేకరణలో వేగం పెరగాలె**

**పెండింగ్ బిల్లులుంటే ఇచ్చేస్తం.. సీఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ**

హైదరాబాద్, మే 19 (ఈవార్తలు): ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా సస్యశ్యామలం కావాలంటే పాలమూరు సాగునీటి ప్రాజెక్టును వేగంగా నిర్మించాల్సిన అవసరం ఉన్నదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఎంసీఆర్ హెచ్ ఆర్ డీ లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి పలు కీలక సూచనలు సీఎం ఇచ్చారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని ఆదేశించారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలయినంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలన్నారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని సీఎం చెప్పారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాకేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్లకృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

# పాలమూరు ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం


**మంత్రి ఉత్తమ్ భరోసా**



హైదరాబాద్, మే 19 (ఈవార్తలు): ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రాజెక్టుల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. దేవాదుల, ఎస్.ఎల్.బీ.సీ, సీతారామ ప్రాజెక్టులతో సరి సమానంగా పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. పాలమూరు జిల్లా ప్రజలకు సమృద్ధిగా సాగు, తాగు నీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మంగళవారం సచివాలయంలో సహచర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలతో కలసి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని ప్రాజెక్టుల నిర్మాణాల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో పాలమూరు జిల్లాకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మరో 15 రోజుల్లో ప్రత్యేక సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి పనుల వేగవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై పునఃసమీక్షిస్తామని పేర్కొన్నారు. తమ హయాంలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 90% పూర్తి అయ్యాయని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని మంత్రి ఉత్తమ్ తేల్చి చెప్పారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.

# నా కలలో శత్రువుల ముఖాలే: ఎన్టీఆర్

## కేక పుట్టించిన ఎన్టీఆర్ డ్రాగన్ గ్లింప్స్



ఎన్టీఆర్ అభిమానుల ఎదురుచూపులకు తెర పడింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన 'ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్' మూవీ గ్లింప్స్ వచ్చేసింది. ఈ చిత్రానికి అధికారికంగా 'డ్రాగన్' టైటిల్‌ను ఖరారు చేశారు. మే 20న తారక్ పుట్టినరోజును పురస్కరించుకుని మంగళవారం అర్ధరాత్రి విడుదలైంది. కథా ప్రపంచాన్ని, అందులోని పాత్రలను ఈ వీడియో ద్వారా పరిచయం చేశారు. ఎన్టీఆర్ లుక్స్, విజువల్స్, రవి బస్రూర్ నేపథ్య సంగీతం ఫ్యాన్స్ అంచనాలను రెట్టింపు చేసేలా ఉన్నాయి. 'కేజీయఫ్', 'సలార్' ఫేమ్ ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్న సంగతి తెలిసిందే. 2027 జూన్ 11న మూవీ రిలీజ్ కానుంది. 'దేవుడు నాకో గొప్పవరం ఇచ్చాడు.. ట్రిగ్గర్ నొక్కగానే మరిచిపోవడం. నిదురపోయినప్పుడు నా కలలోకి నేను చంపిన వారి ముఖాలు రావు.. మిగిలున్న శత్రువుల ముఖాలే కనబడతాయి. పొరపాటున కూడా నా కలలోకి రావొద్దు' అంటూ ఎన్టీఆర్ చెప్పే పవర్‌ఫుల్ డైలాగ్ గూస్‌బంప్స్ తెప్పించింది.

# లులూ మాల్‌లో పురుగుల పవళింపు!

**పురుగులు పట్టిన పిండి, కుళ్లిన కూరగాయలు**

**హైపర్‌మార్కెట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు**

**150 కిలోల ఆహార పదార్థాలు సీజ్**



హైదరాబాద్, మే 19 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని ప్రముఖ షాపింగ్ కేంద్రమైన లులూ హైపర్‌మార్కెట్‌లో తెలంగాణ ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఒక వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో పరిశుభ్రత, ఆహార భద్రతా నిబంధనలకు సంబంధించి తీవ్రమైన ఉల్లంఘనలు బయటపడటంతో అధికారులు దిగ్భ్రాంతికి గురయ్యారు. స్టోర్‌లోని వివిధ విభాగాల నుంచి పాడైన దాదాపు 150 కిలోల ఆహార ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను ఫుడ్ సేఫ్టీ కమిషనర్ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో వెల్లడించారు. తనిఖీల్లో భాగంగా అధికారులు హైపర్‌మార్కెట్‌లోని ఇన్-హౌస్ కిచెన్, రిటైల్ విభాగం, మాంసం విక్రయశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కిచెన్‌లో పరిశుభ్రత అత్యంత దారుణంగా ఉన్నట్లు గుర్తించారు. ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచిన కుళ్లిపోయిన ఆహారాన్ని కనుగొని, వెంటనే దాన్ని పారవేయించారు. అంతేగాక ప్రాంగణంలో పురుగులు, కుళ్లిన కూరగాయలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గడువు తీరడానికి దగ్గరలో ఉన్న ప్యాకేజ్డ్ ఫుడ్ ఐటమ్స్‌పై చిరిగిన, తప్పుదోవ పట్టించే లేబుల్స్ ఉన్నట్లు కనుగొన్నారు. రిటైల్ విభాగంలోనూ పలు ఉల్లంఘనలు వెలుగుచూశాయి. శనగపిండి, గోధుమపిండి, పప్పులు వంటివాటిలో పురుగులు పట్టి ఉండటాన్ని అధికారులు గమనించారు. కొన్ని ప్యాకేజ్డ్ ఫుడ్ ఐటమ్స్‌పై గడువు ముగిసిన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను గుర్తించారు. అనేక ఉత్పత్తులపై పోషక విలువల సమాచారం, తయారీదారుడి చిరునామా, సరైన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ నంబర్ వంటి తప్పనిసరి వివరాలు లేకపోవడం గమనార్హం. మాంసం విక్రయించే బుచరింగ్ విభాగంలోనూ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మాంసం వ్యర్థాలతో డ్రైనేజీలు మూసుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇది ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు కలిగించే ప్రమాదం ఉందని వారు అభిప్రాయపడ్డారు. ఈ తనిఖీ అనంతరం పురుగులు పట్టిన స్వీట్లు, వంట నూనెలు, పిండి, పప్పులతో సహా సుమారు 150 కిలోల ఆహార ఉత్పత్తులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కల్తీ, కృత్రిమ రంగుల వాడకం, పురుగుల కాలుష్యం వంటి అనుమానాలతో పలు ఆహార పదార్థాల నమూనాలను సేకరించి, తదుపరి విశ్లేషణ కోసం ల్యాబొరేటరీకి పంపించారు. ల్యాబ్ నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు.

# ఏసీబీ వలలో 'జల'జలగ

**రూ.1.10 కోట్ల నగదు, కేజీ బంగారం స్వాధీనం**

**వాటర్ బోర్డ్ జీఎం ఎస్ఎల్ కుమార్ ఇళ్లపై దాడులు**


**మొత్తం ఆస్తులు రూ.100 కోట్లు ఉండొచ్చని అంచనా**

హైదరాబాద్, మే 19 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని మెట్రో వాటర్ సప్లై అండ్ మురుగునీటి పారుదల బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ)లో భారీ అవినీతి బట్టబయలైంది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న పక్కా ఆరోపణలతో వాటర్ బోర్డ్ రెడ్ హిల్స్ విభాగం జనరల్ మేనేజర్ (జీఎం) ఎస్.ఎల్. కుమార్‌కు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాలపై మంగళవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో భారీగా నగదు, బంగారం, ఆస్తి పత్రాలు లభించడంతో అధికారులు సైతం విస్తుపోయారు. ఏసీబీ డీఎస్పీ నేతృత్వంలో హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని మొత్తం 8 ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ సోదాలు జరిగాయి. ఈ రోజు ఉదయం ప్రారంభమైన ఈ తనిఖీల్లో సుమారు రూ.1.10 కోట్లకు పైగా నగదు, కేజీ బంగారు ఆభరణాలు, 2.5 కిలోల వెండి వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు పలు కీలకమైన ఆస్తి పత్రాలను కూడా సీజ్ చేశారు. హైదరాబాద్ మల్లాపూర్‌లోని కుమార్ నివాసంలో నగదును లెక్కించి, బంగారు ఆభరణాలను సీల్ చేస్తున్న దృశ్యాలు కనిపించాయి. ఏసీబీ ప్రాథమిక అంచనా ప్రకారం కుమార్ ఆస్తుల విలువ మార్కెట్‌లో సుమారు రూ.100 కోట్ల వరకు ఉండవచ్చని అనుమానిస్తున్నారు. హైదరాబాద్‌లోని ప్రముఖ గేటెడ్ కమ్యూనిటీలలో మూడు ఫ్లాట్లు, ఆరు ఓపెన్ ప్లాట్లు, నిజామాబాద్ జిల్లాలో మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్టు గుర్తించారు. దీంతో పాటు కొన్ని కార్లు కూడా ఆయన పేరు మీద ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం ఎస్.ఎల్. కుమార్‌ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు, ఈ ఆస్తుల వెనుక ఉన్న ఆదాయ వనరులపై లోతుగా ప్రశ్నిస్తున్నారు. ఆయనకు సంబంధించిన బ్యాంకు లాకర్లను కూడా తెరిచి తనిఖీ చేయనున్నారు. గతేడాది డిసెంబర్‌లోనూ రవాణా శాఖకు చెందిన డిప్యూటీ కమిషనర్ మూడ్ కిషన్ కేసులో ఏసీబీ సుమారు రూ.100 కోట్లకు పైగా అక్రమాస్తులను గుర్తించిన విషయం తెలిసిందే. ఇప్పుడు వాటర్ బోర్డ్ అధికారి కేసులోనూ అదే స్థాయిలో ఆస్తులు బయటపడటం తెలంగాణలో కలకలం రేపుతోంది. ఈ సోదాలపై పూర్తి వివరాలను ఏసీబీ అధికారులు సాయంత్రం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

# పట్నంలో ఆఫీస్ కిరాయి డబుల్

**గతేడాదితో పోలిస్తే 21.6 శాతం వృద్ధి నమోదు**

**మొత్తం లీజింగ్‌లో మాదాపూర్ వాటానే 91 శాతం**



హైదరాబాద్, మే 19 (ఈవార్తలు): హైదరాబాద్ ఆఫీస్ మార్కెట్ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో (జనవరి-మార్చి) ఆల్ టైమ్ రికార్డు స్థాయిలో ఆఫీస్ స్థలాల లీజింగ్ కార్యకలాపాలు జరిగాయి. ఈ మూడు నెలల్లో ఏకంగా 31.5 లక్షల చదరపు అడుగుల (ఎంఎస్ఎఫ్) స్థలం లీజుకు వెళ్లింది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది 21.6 శాతం అధికం. ప్రముఖ వాణిజ్య రియల్ ఎస్టేట్ సేవల సంస్థ కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ విడుదల చేసిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. దేశవ్యాప్తంగా జరిగిన మొత్తం ఆఫీస్ లీజింగ్ (సుమారు 2.2 కోట్ల చ.అ.)లో హైదరాబాద్ వాటానే 14 శాతంగా ఉండటం నగర ప్రాముఖ్యతను తెలియజేస్తోంది. ఈ త్రైమాసికంలో జరిగిన లావాదేవీల్లో సింహభాగం భారీ ఒప్పందాలే కావడం గమనార్హం. లక్ష చదరపు అడుగులు, అంతకంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న డీల్స్ మొత్తం లీజింగ్‌లో 81 శాతం వాటాను ఆక్రమించాయి. ఈ మొత్తం కార్యకలాపాల్లో అత్యధికంగా 91 శాతం లీజింగ్ ఒక్క మాదాపూర్‌లోనే జరగడం ఆ ప్రాంత ఆధిపత్యాన్ని స్పష్టం చేస్తోంది. ఈ క్వార్టర్‌లో నగరంలో కొత్తగా ఆఫీస్ భవనాల నిర్మాణం పూర్తి కానప్పటికీ, డిమాండ్ మాత్రం బలంగా కొనసాగింది. ఫలితంగా నికరంగా 22.1 లక్షల చదరపు అడుగుల స్థలం వినియోగంలోకి వచ్చింది. దీంతో నగరవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఆఫీస్ స్థలాల శాతం 20.22 శాతానికి తగ్గింది. ముఖ్యంగా మాదాపూర్‌లో ఖాళీలు కేవలం 7.5 శాతానికే పరిమితం కాగా, అక్కడి ఏ-గ్రేడ్ భవనాల్లో ఇది అత్యంత తక్కువగా 4.8 శాతంగా నమోదైంది. పెరిగిన డిమాండ్, తగ్గిన ఖాళీల ప్రభావంతో నగరంలో ఆఫీస్ అద్దెలు కూడా రికార్డు స్థాయికి చేరాయి. సగటున చదరపు అడుగు అద్దె గతేడాదితో పోలిస్తే 11.6 శాతం పెరిగి రూ. 92.2కు చేరింది. మాదాపూర్‌లో ఇది గరిష్ఠంగా రూ. 105.5గా ఉండగా, గచ్చిబౌలిలో కాస్త తక్కువగా రూ. 72.3గా ఉంది. ఐటీ-బీపీఎం రంగం 36 శాతంతో లీజింగ్‌లో అగ్రస్థానంలో నిలవగా, ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్ (30 శాతం), బీఎఫ్ఎస్ఐ (23 శాతం) రంగాలు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ప్రముఖ అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు నగరంలో తమ కార్యకలాపాలను విస్తరించడం ఈ వృద్ధికి మరింత ఊతమిచ్చింది.

# నీట్-యూజీ రీ ఎగ్జామ్

మే 3న నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్షలో అవకతవకలు, ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలు రావడంతో పరీక్ష రద్దయిన విషయం తెలిసిందే. ఆ పరీక్షకు 22 లక్షలకుపైగా విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష రద్దు కావడంతో ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ సమావేశం నిర్వహించి.. పరీక్ష నిర్వహణలో నిష్పక్షపాతం, పారదర్శకత ఉండాలని స్పష్టం చేశారు. గత పరీక్షా ప్రక్రియలో గుర్తించిన లోపాలు తలెత్తకూడదని అధికారులకు ఆదేశించారు. కఠిన పర్యవేక్షణ వ్యవస్థలపై దృష్టి పెట్టిన ప్రధాన్ పరీక్షా కేంద్రాల్లో అప్రమత్తతతో రీ-నీట్‌ను పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. అలాగే పరీక్ష ఏర్పాట్లు, భద్రతా పర్యవేక్షణ అమలుపై రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

**మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!**

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

# జడ్జికి వేధింపులపై సిట్

హైదరాబాద్, మే 19 (ఈవార్తలు): తెలంగాణలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు, బండి భగీరథ్ పోక్సో కేసు వ్యవహారంలో మరో అత్యంత కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసు విచారణ జరుపుతున్న హైకోర్టు న్యాయమూర్తిపై సోషల్ మీడియా వేదికగా జరిగిన అనుచిత, అవమానకర ప్రచారాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం.. దీనిపై సమగ్ర దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. జాయింట్ సీపీ శ్వేత ఆధ్వర్యంలో ఈ సిట్ పనిచేస్తుందని, న్యాయవ్యవస్థపై జరిగిన ఈ దుష్ప్రచార మూలాలను పూర్తిగా వెలికితీస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. బండి భగీరథ్‌కు సంబంధించిన ముందస్తు బెయిల్ పిటిషన్ తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మాధవి దేవి వద్దకు విచారణకు వచ్చింది. ఈ క్రమంలో కొన్ని ఐటీ సెల్స్, సోషల్ మీడియా హ్యాండిల్స్ వేదికగా ఆమెను లక్ష్యంగా చేసుకుని కొన్ని అనుచిత పోస్టులను సర్క్యులేట్ చేశారు. బండి భగీరథ్‌కు గనుక ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే, దానికి ప్రతిఫలంగా జస్టిస్ మాధవి దేవి భర్తకు బార్ కౌన్సిల్ చైర్మన్ పోస్ట్ ఇస్తారంటూ తీవ్ర ఆరోపణలతో కూడిన పోస్టులను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ వ్యవహారం న్యాయవ్యవస్థ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ఈ కేసు విచారణ ప్రారంభంలోనే జస్టిస్ మాధవి దేవి తనపై జరుగుతున్న ఈ దుష్ప్రచారంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చట్టప్రకారం విచారణ జరిపే న్యాయమూర్తుల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ఇలాంటి పోస్టులు పెట్టడంపై దిగ్భ్రాంతి వ్యక్తమైంది. దీనిపై తెలంగాణ న్యాయమూర్తుల సంఘం నేతలు కూడా తీవ్రంగా స్పందించారు. ఈ ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తూ, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దిగజార్చేలా పోస్టులు పెట్టిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వారు నిరసన వ్యక్తం చేశారు. న్యాయమూర్తుల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ సోషల్ మీడియా దాడికి సంబంధించి ఇప్పటికే ప్రధాన నిందితుడైన దామోదర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరికొందరిపై కూడా కేసులు నమోదు చేశారు. జాయింట్ సీపీ శ్వేత నేతృత్వంలోని సిట్ బృందం ఇప్పుడు ఈ పోస్టుల వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు, ఏ ఐటీ సెల్స్ దీనిని వ్యాప్తి చేశాయనే కోణంలో లోతైన దర్యాప్తు ప్రారంభించింది.

నేటి ఈవార్తలు

**COMMERCIAL RATE CARD**

**DISPLAY ADVERTISEMENTS**
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

**CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:**

**BLACK & WHITE:**
Price for 5 Lines - Rs.450
(for each extra line - Rs.90)

**COLOUR:**
Price for 5 Lines - Rs.500
(for each extra line - Rs.100)

Phone: +91 94404 55811
Email: contact@evarthalu.com

# బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లిపోతా: షేక్ హసీనా

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా సంచలన ప్రకటన చేశారు. 2024లో చెలరేగిన విద్యార్థి ఉద్యమం కారణంగా తన పదవిని కోల్పోయి, ప్రస్తుతం భారతదేశంలో ఆశ్రయం పొందుతున్న ఆమె, తాజాగా ఒక మీడియా ఇంటర్వ్యూలో తన భవిష్యత్తు కార్యాచరణను స్పష్టం చేశారు. తనకు బంగ్లాదేశ్ అంతర్జాతీయ క్రైమ్స్ ట్రైబ్యునల్ మరణశిక్ష విధించినప్పటికీ, తన పార్టీ అయిన 'అవామీ లీగ్' పై నిషేధం విధించినప్పటికీ ఆమె ఏమాత్రం వెనక్కి తగ్గేదే లేదని ప్రకటించారు. "నేను బంగ్లాదేశ్‌లో లేనంత మాత్రాన సైలెంట్‌గా ఉన్నానని అనుకోవద్దు. దేశం కోసం నేను నిరంతరం పోరాడుతూనే ఉన్నాను. అతి త్వరలోనే నేను మళ్లీ నా సొంత దేశానికి తిరిగి వెళ్తాను" అని ధీమా వ్యక్తం చేశారు. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా తాను దేశానికి తిరిగి వెళ్లే నిర్దిష్ట తేదీ, సమయాన్ని ఇప్పుడే వెల్లడించలేనని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం, భావప్రకటన స్వేచ్ఛ, రాజకీయ హక్కులు, చట్టబద్ధమైన పాలన పునరుద్ధరించబడటమే తన ప్రాథమిక లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. తన పార్టీ 'అవామీ లీగ్'పై విధించిన నిషేధంపై ఆమె ఘాటుగా స్పందించారు. "అవామీ లీగ్ అనేది ప్రజల గుండెల్లో ఉన్న పార్టీ. కేవలం ఒక ప్రభుత్వ కాగితపు ఆర్డర్‌తో దానిని క్లోజ్ చేయడం ఎవరి తరం కాదు. అదే నిజమైతే అసలు బంగ్లాదేశ్ అనే దేశమే పుట్టేది కాదు" అని గుర్తుచేశారు. గతంలో తనపై 19 సార్లు హత్యాప్రయత్నాలు జరిగాయని, అయినా తాను ఎన్నడూ భయపడలేదని, ఇప్పటికీ లక్షలాది మంది మద్దతుదారులు పార్టీ కోసం నిలబడే ఉన్నారని చెప్పారు. గతంలో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధినేతగా వ్యవహరించిన ముహమ్మద్ యూనుస్‌పై ఆమె తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.



# ముంగిట్లో ఆర్థిక ముప్పు

**త్వరలో భయంకరమైన సంక్షోభం.. మోదీ విధానాలపై రాహుల్ ఫైర్**



రాయ్‌బరేలీ: దేశం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో ప్రధాని నరేంద్ర మోదీ విదేశాల్లో పర్యటిస్తున్నారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. సొంత నియోజకవర్గమైన రాయ్‌బరేలీలో పర్యటించిన ఆయన చురువా హనుమాన్ ఆలయాన్ని సందర్శించిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. దేశంలో సంక్షోభ పరిస్థితులు ఉన్నాయని.. ప్రజలను బయటకు వెళ్లొద్దని ప్రధాని పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆయనేమో ప్రపంచమంతా చుట్టేస్తున్నారని రాహుల్ ఎద్దేవా చేశారు. ముందుముందు దేశంపై ఒక పెద్ద ఆర్థిక తుపాను విరుచుకుపడబోతోందని రాహుల్ గాంధీ హెచ్చరించారు. "రాబోయే ఆర్థిక సంక్షోభం అదానీ, అంబానీ, మోదీని ఏమీ చేయలేదు. వాళ్లంతా తమ ప్యాలెస్‌లలో భద్రంగా ఉంటారు. కానీ దేశ యువత, సామాన్య ప్రజలు దీనివల్ల తీవ్రంగా దెబ్బతింటారు. ఇంతకుముందెన్నడూ చూడని భయంకరమైన ఆర్థిక సంక్షోభాన్ని దేశం చూడబోతోంది. కష్టకాలం ముందుంది. మోదీ ఆర్థిక విధానాలే ఇందుకు కారణం" అని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రధాని మోదీ ఐదు దేశాల దౌత్య పర్యటనలో భాగంగా మంగళవారం రాత్రి ఇటలీ చేరుకోనున్నారు. అంతకుముందే ఆయన యూఏఈ, నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే దేశాల పర్యటనలను పూర్తి చేసుకున్నారు.

## వాయుసేనకు స్కార్పియోలు

న్యూఢిల్లీ: భారత వైమానిక దళం తమ అధికారిక వాహన శ్రేణిలోకి సరికొత్త మహీంద్రా స్కార్పియో క్లాసిక్ ఎస్11 ఎస్‌యూవీల బ్యాచ్‌ను చేర్చుకుంది. దేశ రాజధాని ఢిల్లీ రోడ్లపై ఒకేసారి ఐదారు వాహనాలు కలిసి వెళుతుండగా తీసిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో, ఆటోమొబైల్ వర్గాల్లో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. సాధారణంగా భారత రక్షణ రంగానికి, పోలీస్ శాఖలకు స్కార్పియో అత్యంత నమ్మకమైన వాహనం. అయితే, తాజాగా ఐఏఎఫ్ దళంలో చేరిన ఈ స్కార్పియో క్లాసిక్ మోడల్స్ చూడటానికి అత్యంత ఆకర్షణీయంగా ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం... ఈ కార్లకు వేసిన 'ఎయిర్ ఫోర్స్ బ్లూ' కలర్. ఈ కలర్ షేడ్‌ను మహీంద్రా సంస్థ సాధారణ పౌరులు కొనుగోలు చేసే సివిలియన్ వర్షన్‌లో ఆఫర్ చేయడం లేదు, కేవలం వైమానిక దళం కోసమే ప్రత్యేకంగా దీనిని డిజైన్ చేశారు.

## దేవుళ్ల బంగారం ముట్టుకోం

**ఆలయాల బంగారాన్ని నగదుగా మార్చే ప్రణాళికలు లేవు: కేంద్రం**

న్యూఢిల్లీ: దేశంలోని వివిధ దేవాలయాలు, మతపరమైన సంస్థల వద్ద ఉన్న బంగారాన్ని నగదుగా మార్చుకునే (మానిటైజేషన్) యోచనలో ప్రభుత్వం ఉందంటూ సాగుతున్న ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. ఇవన్నీ అబద్ధపు ప్రచారాలని, అలాంటి ప్రతిపాదనేమీ తమ వద్ద లేదని స్పష్టం చేసింది. ఆలయాల బంగారు నిల్వలను తీసుకుని వాటికి బదులుగా గోల్డ్ బాండ్లు జారీ చేయడానికి కేంద్రం సిద్ధమవుతోందని గత కొన్ని రోజులుగా సోషల్ మీడియా సహా కొన్ని మీడియా సంస్థల్లో వార్తలు వచ్చాయి. దీనిపై ప్రభుత్వం స్పందిస్తూ.. "దేవాలయాల ట్రస్టులు, మతపరమైన సంస్థల బంగారాన్ని మానిటైజ్ చేసే పథకాన్ని తీసుకురాబోతున్నామనే వార్తల్లో ఎలాంటి నిజం లేదు. అవన్నీ పూర్తిగా అవాస్తవం. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయి" అని కొట్టిపారేసింది. అలాగే ఆలయ గోపురాలు, తలుపులు, ఇతర నిర్మాణాలపై ఉండే బంగారు పూతలను భారత 'వ్యూహాత్మక బంగారు నిల్వలు'గా పరిగణించబోతున్నారనే ప్రచారాన్నీ ప్రభుత్వం ఖండించింది. అధికారిక వెబ్‌సైట్లు, ప్రకటనల ద్వారా వచ్చే సమాచారాన్ని మాత్రమే నమ్మాలని.. ఎలాంటి ఆధారాల్లేని ఇలాంటి వదంతులతో ప్రజల్లో గందరగోళం సృష్టించొద్దని పౌరులను కోరింది.

## ఇల్లీగల్ ఎఫైర్ వద్దంటే చంపేసింది!

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో మానవ సంబంధాల విలువలను నడిరోడ్డుపై తగలబెట్టేలా అత్యంత క్రూరమైన, భయానకమైన ఘటన చోటుచేసుకుంది. తన భార్యకు ఉన్న వివాహేతర సంబంధం గురించి నిలదీసినందుకు, ఆ భార్య తన తల్లితో కలిసి భర్తపైనే పెట్రోల్ పోసి సజీవ దహనం చేసిన సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఢిల్లీలోని నార్త్ వెస్ట్ జిల్లా జహంగీర్‌పురి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ దారుణ ఉదంతం వెలుగుచూసింది. ఈ ఘటనకు పాల్పడిన నిందితులైన తల్లీకూతుళ్లను పోలీసులు ఇప్పటికే కస్టడీలోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. బాధితులు నివసిస్తున్న ఇంటిని అద్దెకు ఇచ్చిన యజమాని తెలిపిన వివరాల ప్రకారం... రాత్రి 8:30 గంటల సమయంలో సదరు ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మొదట చుట్టుపక్కల వారు దానిని షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన ప్రమాదంగా భావించారు. కానీ అంతలోనే ఊహించని విధంగా ఒక యువకుడు ఒంటిపై బట్టలు లేకుండా, ఒళ్లంతా మంటలు కాలిపోతూ ప్రాణభయంతో కేకలు వేస్తూ మెట్లపై నుండి కిందకు పడిపోయాడు. తీవ్రంగా గాయపడి మరణానికి అత్యంత చేరువలో ఉన్న ఆ యువకుడు చనిపోయే ముందు ఇచ్చిన ఆఖరి స్టేట్‌మెంట్ స్థానికంగా పెను సంచలనంగా మారింది.

## స్పీకర్ చెంతకు 'యశ్వంత్ వర్మ' నివేదిక

న్యూఢిల్లీ: హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపిన జడ్జెస్ ఎంక్వైరీ కమిటీ (న్యాయమూర్తుల విచారణ కమిటీ) తన నివేదికను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్ నేతృత్వంలోని ఈ కమిటీ సభ్యులు పార్లమెంట్ హౌస్‌లో స్పీకర్‌ను కలిసి నివేదికను అందజేశారు. ఈ కమిటీలో బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీ చంద్రశేఖర్, కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయవాది బీవీ ఆచార్య సభ్యులుగా ఉన్నారు. జడ్జెస్ (ఇంక్వైరీ) యాక్ట్, 1968 ప్రకారం చట్టబద్ధమైన నిబంధనలకు అనుగుణంగా ఈ నివేదికను స్పీకర్‌కు సమర్పించారు. జస్టిస్ యశ్వంత్ వర్మపై వచ్చిన ఆరోపణల విచారణ నిమిత్తం గత ఏడాది ఆగస్టు 12న లోక్‌సభ స్పీకర్ ఈ విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సమర్పించిన ఈ నివేదికను తగిన సమయంలో పార్లమెంటు ఉభయ సభల ముందు ప్రవేశపెట్టనున్నట్లు అధికారులు తెలిపారు. నివేదికలోని అంశాలు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన తర్వాతే వెల్లడయ్యే అవకాశం ఉంది.

## కదులుతున్న కారులో మహిళా లాయర్‌పై గ్యాంగ్ రేప్

ముంబై: మహారాష్ట్రలోని పుణే నగరంలో అత్యంత దారుణమైన, దిగ్భ్రాంతికరమైన ఘటన వెలుగుచూసింది. మ్యాట్రిమోనియల్ సైట్ ద్వారా పరిచయమైన వ్యక్తిని కలిసేందుకు వెళ్లిన ఒక మహిళా లాయర్‌పై... కదులుతున్న కారులోనే పైశాచికంగా సామూహిక లైంగిక దాడికి ఒడిగట్టారు. ఈ ఘోరానికి సంబంధించి పుణే పోలీసులు వేగంగా స్పందించి ఇప్పటికే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోగా, పరారీలో ఉన్న మరొకరి కోసం గాలిస్తున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం... బీహార్‌లోని పాట్నాకు చెందిన సదరు బాధిత మహిళ పుణేలోనే ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసి, ప్రస్తుతం బాంబే హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. వృత్తిపరమైన పని నిమిత్తం పుణేకు వచ్చిన ఆమె.. గత ఆదివారం ఒక ప్రముఖ మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్ ద్వారా పరిచయమైన వ్యక్తిని కోరేగావ్ పార్క్‌లోని ఒక ఫైవ్ స్టార్ హోటల్‌కు రమ్మని కోరారు. సదరు వ్యక్తి తనతో పాటు మరో ఇద్దరు మహిళలను తీసుకుని రాగా, అంతా కలిసి కొద్దిసేపు మాట్లాడుకుని ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. ఆ తర్వాత అదే హోటల్‌లో ఆదివారం రాత్రి మద్యం సేవించే క్రమంలో, పక్క టేబుల్‌పై ఉన్న మరో ఇద్దరు వ్యక్తులతో ఆమెకు మాటలు కలిసి పరిచయం ఏర్పడింది. అనంతరం వారంతా కలిసి ఒక పబ్ కు వెళ్లాలని నిర్ణయించుకుని కారులో బయలుదేరారు. అయితే, కారు ప్రయాణంలో ఉండగానే నిందితుల్లో ఒకడు ఆమెపై లైంగిక దాడికి తెగబడ్డాడు.

# బాధ ఉంటే కోర్టుకు పో!

**నార్వే జర్నలిస్టుపై విదేశాంగ శాఖ అసంతృప్తి**

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ నార్వే పర్యటనలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. భారత ప్రజాస్వామ్యం, మీడియా స్వేచ్ఛపై ప్రశ్నలు లేవనెత్తిన ఓ నార్వేజియన్ జర్నలిస్టుకు, భారత విదేశాంగ శాఖ అధికారి ఘాటుగా సమాధానమిచ్చారు. 'ఏమైనా సమస్యలుంటే కోర్టుకు వెళ్లండి' అంటూ ఆయన ఇచ్చిన జవాబు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఐరోపా పర్యటనలో భాగంగా ఓస్లోలో ప్రధాని మోదీ, నార్వే ప్రధాని జోనాస్ గార్ స్టోర్‌తో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నార్వే ప్రధాని ప్రశ్నలకు సమాధానమిచ్చినా, మోదీ మాత్రం ప్రశ్నలను పట్టించుకోకుండా వెళ్లిపోయారు. దీనిపై నార్వేజియన్ జర్నలిస్ట్ హెల్లె లింగ్ తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ తన ప్రశ్నను స్వీకరించలేదని ఆమె



ఆరోపించారు. అనంతరం భారత విదేశాంగ శాఖ నిర్వహించిన మీడియా సమావేశంలో అదే జర్నలిస్ట్ పాల్గొన్నారు. భారత ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, పత్రికా స్వేచ్ఛ వంటి అంశాలపై ఆమె ప్రశ్నలు సంధించారు. దీంతో ఆమెకు, విదేశాంగ శాఖ కార్యదర్శి (వెస్ట్) సిబి జార్జ్‌కు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సిబి జార్జ్ తన సమాధానంలో భారత ప్రజాస్వామ్య వ్యవస్థను బలంగా సమర్థించారు. భారత రాజ్యాంగం పౌరులకు ప్రాథమిక హక్కులు కల్పించిందని, న్యాయం కోసం ఆర్టికల్ 32, 226 కింద కోర్టులకు వెళ్లే స్వేచ్ఛ ఉందని స్పష్టం చేశారు. కొంతమంది విదేశీ విమర్శకులు "అజ్ఞాన ఎన్జీవోలు" ఇచ్చే నివేదికలపై ఆధారపడి తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఏవైనా సమస్యలుంటే కోర్టును ఆశ్రయించాలని ఆమెకు సూచించారు. జర్నలిస్ట్ పదేపదే అడ్డుతగలడంతో సిబి జార్జ్ కాస్త అసహనానికి గురయ్యారు. ఈ సంభాషణకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కాగా, భారత దౌత్యాధికారి ఇచ్చిన బలమైన సమాధానంపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# సెప్టెంబర్‌లో భారత్‌కు పుతిన్

**ధ్రువీకరించిన రష్యా అధ్యక్ష భవనం.. బ్రిక్స్ సమావేశంలో పాల్గొనున్న రష్యా అధ్యక్షుడు**

మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ఏడాది సెప్టెంబర్ 12, 13 తేదీల్లో భారత్ లో పర్యటించనున్నారు. భారత్ ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీ రానున్నట్లు ఆ దేశ అధ్యక్ష భవనం 'క్రెమ్లిన్' మంగళవారం అధికారికంగా ధృవీకరించింది. భారత్, రష్యా మధ్య వ్యూహాత్మక, రక్షణ రంగ బంధం బలపడుతున్న తరుణంలో పుతిన్ పర్యటన ఖరారు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత డిసెంబర్‌లో జరిగిన 23వ భారత్-రష్యా వార్షిక సదస్సు కోసం పుతిన్ ఢిల్లీకి వచ్చారు. ఆ సమయంలో మోదీతో కలిసి ద్వైపాక్షిక సంబంధాల విస్తరణపై చర్చలు జరిపారు. ఆ పర్యటన జరిగిన ఏడాదిలోపే పుతిన్ రెండోసారి భారత్‌కు వస్తుండటం గమనార్హం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం 2022లో ప్రారంభమైన తర్వాత పుతిన్ గతేడాది డిసెంబర్‌లోనే మొదటిసారి



భారత్‌లో అడుగుపెట్టారు. దానికి ముందు ఆయన 2021లో ఢిల్లీని సందర్శించారు. భారత్-రష్యా మధ్య ఏటా ఒకసారి ఇరు దేశాల అధినేతలు భేటీ అయ్యే సంప్రదాయం ఉంది. ఒక ఏడాది భారత్‌లో జరిగితే, మరో ఏడాది రష్యాలో ఈ వార్షిక సదస్సు జరుగుతుంది. భారత్ నేతృత్వంలో ఢిల్లీలో జరగబోయే ఈ ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ సదస్సులో.. ప్రపంచ భద్రతా సవాళ్లు, ఆర్థిక సహకారం బలోపేతం చేయడం వంటి కీలక అంశాలపై సభ్య దేశాల అధినేతలు చర్చించనున్నారు.

# కేజ్రీవాల్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు

**మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్‌కూ**

న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మపై వ్యాఖ్యల కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్‌కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మద్యం పాలసీ కేసు విచారణకు సంబంధించి జస్టిస్ స్వర్ణకాంత శర్మను ప్రణాళిక ప్రకారం సోషల్ మీడియాలో లక్ష్యంగా చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి సంబంధించి ముగ్గురికి కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేసింది. జస్టిస్ స్వర్ణకాంత శర్మపై వ్యాఖ్యల కేసుపై జస్టిస్ నవీన్ చావ్లా, జస్టిస్ రవీందర్ దుడేజాలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. అనంతరం ముగ్గురికి కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోపు సమాధానం చెప్పాలని కోర్టు ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను ఆగస్టు 4వ తేదీకి వాయిదా వేసింది. మద్యం పాలసీ కేసును విచారిస్తున్న జస్టిస్ స్వర్ణకాంత శర్మను ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, వారి మద్దతుదారులు లక్ష్యంగా చేసుకున్నారు. సోషల్ మీడియాలో కొన్ని పోస్టులు, వీడియోలు పెట్టారు. ఓ విద్యాసంస్థలో జస్టిస్ స్వర్ణకాంత శర్మ మాట్లాడిన పాత వీడియోను ఎడిట్ చేసి, ఆమె ఓ రాజకీయ పార్టీకి అనుకూలంగా





మాట్లాడుతున్నట్లుగా తప్పుగా ప్రచారం చేశారు. ఆమె ఈ కేసును నిష్పక్షపాతంగా విచారించలేరని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఆ ప్రచారంపై జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై దుష్ప్రచారం సాగించారనే ఆరోపణలపై గురువారం స్వచ్ఛందంగా కోర్టు ధిక్కరణ చర్యలను ప్రారంభించారు. అదే సమయంలో ఈ కేసు విచారణ నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించారు.

## యూపీలో జిమ్ జిహాద్

**మతమార్పిడికి పాల్పడుతున్న వారిపై గ్యాంగ్‌స్టర్ చట్టం**

మీర్జాపూర్: ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌లో హిందూ మహిళలను లక్ష్యంగా చేసుకుని మతమార్పిడికి పాల్పడుతున్న ముఠాను పోలీసులు రట్టు చేశారు. బలవంతపు మతమార్పిడికి పాల్పడుతున్న పదిమందిపై గ్యాంగ్‌స్టర్ చట్టం కింద కేసు నమోదు చేశారు. పదిమందిని అరెస్టు చేశామని, దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. ఇటీవల నాసిక్‌లోని టీసీఎస్ కంపెనీలో బలవంతపు మతమార్పిళ్లు, లైంగిక వేధింపులు చోటుచేసుకోవడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌లోని



మీర్జాపూర్‌లో అలాంటి సంఘటన వెలుగు చూసింది. జిమ్‌లలో చేరే మహిళలను లక్ష్యంగా చేసుకుని మతమార్పిడి చేస్తున్న నెట్ వర్క్‌ను పోలీసులు గుర్తించారు. మీర్జాపూర్‌లో ఒక జిమ్ యజమాని మతం మారాలని తనను బలవంతం చేస్తున్నాడని ఒక యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై విచారణ చేస్తుండగా దీని వెనుక పెద్ద నెట్ వర్క్ ఉన్నట్లు గుర్తించారు. నిందితులు రాష్ట్రంలోని వివిధ జిమ్‌లు, సోషల్ మీడియాల్లో ముందుగా మహిళలతో పరిచయాలు పెంచుకుంటారు. ఆ తర్వాత మతం మారాలని ఒత్తిడి చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. దాదాపు 50 మందికి పైగా మహిళలను లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో సన్నో అనే మహిళ ప్రధాన పాత్రను పోషించినట్లు వెల్లడించారు.

## టీనేజర్ల కోసం పేటీఎం 'పాకెట్ మనీ'

**తల్లిదండ్రుల పర్యవేక్షణలో యూపీఐ చెల్లింపులు**

న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపుల దిగ్గజం పేటీఎం, టీనేజర్లను లక్ష్యంగా చేసుకుని మరో కీలకమైన ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. 'పేటీఎం పాకెట్ మనీ' పేరుతో నేడు ప్రారంభించిన ఈ కొత్త సదుపాయం ద్వారా బ్యాంకు ఖాతా లేని టీనేజర్లు కూడా నేరుగా యూపీఐ చెల్లింపులు చేసేందుకు అవకాశం కలుగుతుంది. నగదు కోసం లేదా చెల్లింపులు పూర్తి చేయడానికి తల్లిదండ్రులపై ఆధారపడాల్సిన అవసరం




ఉందని కంపెనీ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమర్పించిన ప్రకటనలో తెలిపింది. ఈ ఫీచర్ ద్వారా తల్లిదండ్రులు లేదా కుటుంబ సభ్యులు తమ పిల్లల నెలవారీ ఖర్చులకు పరిమితి విధించవచ్చు. అంతేగాక వారు చేసే యూపీఐ లావాదేవీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించవచ్చు. "పేటీఎం స్పెండ్ సమ్మరీతో కుటుంబాలు తమ పిల్లల ఖర్చుల సరళిని సమీక్షించుకోవచ్చు. వారికి ఇచ్చే పాకెట్ మనీని మెరుగ్గా నిర్వహించడంతో పాటు సురక్షితమైన, బాధ్యతాయుతమైన అలవాట్లను చిన్నతనం నుంచే నేర్పించవచ్చు" అని పేటీఎం ఒక ప్రకటనలో పేర్కొంది. పాఠశాల, కళాశాల క్యాంటీన్లు, మెట్రో రైళ్లు, క్యాబ్‌లు, మొబైల్ రీఛార్జ్‌లు, షాపింగ్ వంటి రోజువారీ అవసరాలకు ఈ ఫీచర్ టీనేజర్లకు ఎంతగానో ఉపయోగపడుతుంది.




## త్వరలో వాట్సాప్‌లో పీఎఫ్ సేవలు

న్యూఢిల్లీ: ప్రావిడెంట్ ఫండ్ సంబంధిత సేవల కోసం త్వరలో వాట్సాప్ సేవలను ఈపీఎఫ్ఓ అందుబాటులోకి తేనుంది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది వాట్సాప్‌ను వినియోగిస్తున్నారని, ఈ నేపథ్యంలో దీని ద్వారా ఎంతోమందికి చేరువ కావడం సులువవుతుందని కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. ఈపీఎఫ్ఓ చందదారుల వెసులుబాటు కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. పీఎఫ్ బ్యాలెన్స్, చివరి ఐదు లావాదేవీలు, క్లెయిమ్ స్టేటస్ వంటి వివరాలను వాట్సాప్ ద్వారా తెలుసుకోచ్చు. గ్రీన్ టిక్ మార్కు కలిగిన ఈపీఎఫ్ఓ వాట్సాప్ నెంబర్‌కు 'హలో' అని మెసేజ్ చేయడం ద్వారా ఈ సేవలు పొందవచ్చు. యూఏఎన్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా ఈ సేవలు లభిస్తాయి. ఈపీఎఫ్ఓకు సంబంధించిన సందేశాలు కూడా స్థానిక భాషల్లో ఎప్పటికప్పుడు అందుకోవచ్చు. ఆటోమేటెడ్ సిస్టం ద్వారా వాట్సాప్ సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. నెల రోజుల్లోపు ఈ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. మరోవైపు, యూపీఐ ద్వారా పీఎఫ్ నిల్వలను ఉపసంహరించుకునే వెసులుబాటు కూడా త్వరలో అందుబాటులోకి రానుందని కేంద్రమంత్రి తెలిపారు.

## ఎమ్మెల్యే ఫోన్ కొట్టేశారు!

**మార్నింగ్ వాక్ చేస్తుండగా లాక్కెళ్లారు**

**8 గంటల్లోనే నిందితుడి అరెస్ట్..**

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో సీనియర్ బీజేపీ నేత, మాజీ అసెంబ్లీ స్పీకర్, ఎమ్మెల్యే ధరమ్‌లాల్ కౌశిక్‌కు చేదు అనుభవం ఎదురైంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటనలో ఉన్న సమయంలోనే, ఆయన వాకింగ్ చేస్తుండగా బైక్‌పై వచ్చిన దుండగులు మొబైల్ ఫోన్‌ను లాక్కెళ్లారు. అయితే, పోలీసులు కేవలం 8 గంటల్లోనే కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. సోమవారం ఉదయం సివిల్ లైన్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పీడబ్ల్యూడీ వంతెన సమీపంలో కౌశిక్ వాకింగ్ చేస్తున్నారు. ఆ సమయంలో బైక్‌పై వేగంగా వచ్చిన ఆగంతకులు ఆయన చేతిలోని ఫోన్‌ను లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. క్రైమ్ బ్రాంచ్, స్థానిక పోలీసులు సంయుక్త బృందాలుగా ఏర్పడి వందలాది సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. ఈ క్రమంలో 8 గంటల వ్యవధిలోనే బలోదాబజార్ జిల్లాకు చెందిన 19 ఏళ్ల యువకుడిని అరెస్ట్ చేశారు. నిందితుడు బైక్ ట్యాక్సీ రైడర్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. అతని నుంచి, అపహరించిన ఫోన్‌తో పాటు, నేరానికి ఉపయోగించిన బైక్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన రాష్ట్రంలో రాజకీయ దుమారం రేపింది. బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. రాజధానిలో దోపిడీలు, హత్యలు పెరిగిపోయాయని, శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని కాంగ్రెస్ నేత సుశీల్ ఆనంద్ శుక్లా ఆరోపించారు. పోలీసులు నేరాలను అరికట్టకుండా, కేవలం ట్రాఫిక్ నియంత్రణకే పరిమితమయ్యారని విమర్శించారు.

# ఏపీలో బీసీలే టాప్

## మొత్తం 2.69 కోట్ల మంది... 1.25 కోట్లతో ఓసీలు రెండో స్థానం




అమరావతి, మే 19 (ఈవార్తలు): ఏపీలో గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన కులగణన నివేదిక తాజాగా బయటకు వచ్చింది. 2024 ఎన్నికలకు ముందు చేపట్టిన ఈ సర్వే వివరాలను అప్పటి ప్రభుత్వం అధికారికంగా విడుదల చేయలేదు. అయితే, ప్రస్తుతం బయటకు వచ్చిన ఈ గణాంకాల ప్రకారం రాష్ట్ర జనాభాలో సగానికి పైగా, అంటే 50.59 శాతం వెనుకబడిన తరగతుల (బీసీ) వారే ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఇది రాష్ట్ర సామాజిక, రాజకీయ సమీకరణాల్లో అత్యంత కీలకమైన అంశంగా మారింది. నివేదిక ప్రకారం ఏపీ మొత్తం జనాభా 5,31,39,056 మంది కాగా, ఇందులో పురుషులు 2,63,60,353 మంది, మహిళలు 2,65,56,816 మంది ఉన్నారు. అంటే, పురుషుల కంటే మహిళలు 1.96 లక్షల మంది అధికంగా ఉన్నారు. మొత్తం జనాభాలో బీసీలు 2.69 కోట్లతో మొదటి స్థానంలో నిలవగా, 1.25 కోట్ల జనాభాతో అగ్రవర్ణాలు (ఓసీలు) 23.53 శాతంతో రెండో స్థానంలో ఉన్నారు. షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు) 97.32 లక్షల మంది (18.31 శాతం), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) 31.16 లక్షల మంది (5.86 శాతం) ఉన్నారు. తమ కులాన్ని వెల్లడించని వారు 8.75 లక్షల మంది (1.64 శాతం) ఉన్నట్లు సర్వేలో తేలింది. రాష్ట్రంలో 138 బీసీ కులాలు ఉండగా, శాతం పరంగా చూస్తే శ్రీకాకుళం జిల్లాలో అత్యధికంగా 80.83 శాతం బీసీలు (19.29 లక్షలు) నివసిస్తున్నారు. ఆ తర్వాత విజయనగరం (76.55 శాతం), అనకాపల్లి (72.73 శాతం) జిల్లాలు ఉన్నాయి. జనాభా సంఖ్య పరంగా చూసినా శ్రీకాకుళం (19.29 లక్షలు) అగ్రస్థానంలో ఉండగా, కర్నూలు (18.85 లక్షలు), విశాఖపట్నం (15.48 లక్షలు) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో కేవలం 3.26 శాతం బీసీలు ఉన్నారు. ఎస్సీ జనాభా శాతం పరంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా 27.66 శాతంతో ముందుండగా, సంఖ్యాపరంగా తిరుపతి జిల్లాలో అత్యధికంగా 5.61 లక్షల మంది ఎస్సీలు ఉన్నారు. గిరిజన ప్రాంతమైన అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎస్టీ జనాభా 94.40 శాతంగా నమోదైంది. సంఖ్యాపరంగా కూడా ఇదే జిల్లాలో అత్యధికంగా 6.60 లక్షల మంది ఎస్టీలు ఉన్నారు. అత్యల్పంగా పశ్చిమ గోదావరి జిల్లాలో కేవలం 0.94 శాతం ఎస్టీలు ఉన్నారు. ఇక ఓసీల జనాభా సంఖ్యాపరంగా కడప జిల్లాలో అత్యధికంగా 7.80 లక్షల మంది ఉండగా, తూర్పుగోదావరి (7.61 లక్షలు), కాకినాడ (7.58 లక్షలు) జిల్లాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యల్పంగా 5,743 మంది ఓసీలు మాత్రమే ఉన్నారు. గత ప్రభుత్వం ఈ గణాంకాలను అధికారికంగా విడుదల చేయనప్పటికీ, ప్రస్తుతం బయటకు వచ్చిన ఈ వివరాలు రాష్ట్ర సామాజిక, రాజకీయ రంగాల్లో విస్తృత చర్చకు దారితీస్తున్నాయి. కొత్తగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వం కూడా సమగ్ర కుటుంబ సర్వే చేపట్టిన నేపథ్యంలో ఈ గణాంకాలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది.



## ఉత్తమ జర్నలిస్టుకు ఘన సన్మానం

జగిత్యాల టౌన్, మే 19 (ఈవార్తలు): సీఈటీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నసీమ్ ఆరిఫీ ఉర్దూ మీడియా అవార్డ్స్-2025 కార్యక్రమంలో జగిత్యాలకు చెందిన పాత్రికేయుడు మీర్జా ఫజల్ బేగ్ ఉత్తమ జర్నలిస్టు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఆయనకు ఘన సన్మానం నిర్వహించారు. జగిత్యాల ఎంఐఎం అధ్యక్షుడు సుమీర్ ఉద్దీన్ అజాద్ నాయకత్వంలో ఎంఐఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కౌన్సిలర్ రజి ఉద్దీన్, కౌన్సిలర్ అయూబ్ ఖాన్‌తో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. వారు మీర్జా ఫజల్ బేగ్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ నుమాన్, వాజిద్, అద్నాన్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



## సేంద్రియ సాగు బాట పట్టాలి

**రైతులకు ఎమ్మెల్యే సంజయ్ పిలుపు**

బీర్పూర్, మే 19 (ఈవార్తలు): రైతులు సేంద్రీయ ఎరువులను వినియోగించాలని, రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. బీర్పూర్ మండలంలోని తుంగూరు గ్రామంలో గల ఆర్ఆర్ ఫంక్షన్ హాల్లో తుంగూరు ఆగ్రెస్ రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను అధికారులతో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు డిమాండ్ ఉన్న సన్నరకాలను సాగు చేయాలని, ఆయిల్పామ్ పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. జమును, జీలుగు, పెసర పంటలు వేసి సేంద్రీయ మును పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో తిరుపతి, ఏఈవో అయ్యోరి వినోద్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అర్థకోట రాజ గోపాల్రావు, సర్పంచులు ఎలమట్ల హరీష్, తోట శ్రీనివాస్, సృజన సుశిన్, రైతులు, నాయకులు దోసారపు బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.



## ధర్మపురిలో విజయలక్ష్మి లాడ్జ్ సీజ్

ధర్మపురి, మే 19 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ధర్మపురిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న విజయలక్ష్మి లాడ్జ్‌ను మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. ఇటీవల కరీంనగర్‌లోని పీఎంజే జువెలరీ షాపులో జరిగిన దోపిడీ కేసుకు సంబంధించి నిందితులు ఈ నెల 1, 2 తేదీల్లో ధర్మపురిలోని విజయలక్ష్మి లాడ్జ్‌లో ఆశ్రయం తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. గోదావరి రోడ్డులో ఉన్న విజయలక్ష్మి లాడ్జ్ అవసరమైన నిబంధనలను పాటించకుండా నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ధర్మపురి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ధర్మపురి సీఐ రామ నరసింహారెడ్డి, ఎస్సై మహేష్, పోలీసు సిబ్బంది భద్రత మధ్య లాడ్జ్ నిర్వాహకుడు నర్మల గుండయ్యకు నోటీసులు అందజేసి లాడ్జ్‌ను సీజ్ చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.

## పాస్టర్ దర్శన్‌పై దాడి ఓ డ్రామా

అల్లూరి జిల్లా, మే 19 (ఈవార్తలు): పాస్టర్ అభినయ్ దర్శన్‌పై హత్యాయత్నం కేసులో సంచలన విషయాలు వెలుగు చూశాయి. అతనిపై దాడి జరగలేదని, అదంతా ప్రణాళిక ప్రకారం ఆడిన పెద్ద నాటకంగా పోలీసులు తేల్చారు. సింపతీ కోసం, ఇతర వ్యక్తిగత కారణాలతో అతను ఈ హైడ్రామాకు తెరలేపినట్లు పోలీసులు గుర్తించారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో అభినయ్ దర్శన్‌పై హత్యాయత్నం జరిగినట్లు కేసు నమోదైంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టగా, విస్తుగొలిపే విషయాలు వెల్లడయ్యాయి. ఇటీవల చింతపల్లి పరిసర ప్రాంతాల్లో తన కారుపై గుర్తుతెలియని దుండగులు దాడి చేశారని, తృటిలో తాను ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నానని అభినయ్ దర్శన్ చేసిన ప్రచారం అంతా నాటకమేనని పోలీసులు తేల్చారు. తనను చంపేందుకు ప్రయత్నించారని అతను నమ్మించే ప్రయత్నం చేశాడు. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా కలకలం రేపింది. అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ క్షేత్రస్థాయిలో లోతుగా దర్యాప్తు చేపట్టారు. విచారణలో అసలు అభినయ్ దర్శన్‌పై దాడి జరగలేదని తేలింది. ఈ నాటకంలో అతడికి మరో ఆరుగురు సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. అభినయ్ దర్శన్‌కు సంబంధించిన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు సంబంధించిన ఆడియోలు, వీడియో చాట్‌లు, కీలకమైన వైద్యుల నివేదికను పోలీసులు పరిశీలించారు. ఇదంతా ఫేక్ అటాక్ అని తేల్చారు. దాడి జరిగిందంటూ హైడ్రామా సృష్టించిన అభినయ్ దర్శన్, ఇతరులపై పోలీసులు చర్యలు తీసుకోనున్నారు.

## నరకం నుంచి కాపాడండి

**బాబు, పవన్‌కు కువైట్ బాధిత మహిళ వేడుకోలు**

చంద్రగిరి, మే 19 (ఈవార్తలు): బతుకు దెరువు కోసం కువైట్ వచ్చిన తాను నరకయాతన అనుభవిస్తున్నానని, తనను రక్షించాలని ఓ మహిళ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉ పముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను వేడుకుంది. సెల్ఫీ వీడియో తీసి తనను కాపాడాలని వారికి విజ్ఞప్తి చేసింది. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం తొండవాడకు చెందిన భాగ్యవతి ఉపాధి కోసం కువైట్ వెళ్ళింది. పీలేరుకు చెందిన ఏజెంట్ మాయమాటలు విని మోసపోయింది. కువైట్‌లో ఇళ్ళల్లో పని అని చెప్పి భాగ్యవతిని ఏజెంట్ అక్కడకు పంపించాడు. కానీ తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారంటూ ఆమె కన్నీరుమున్నీరైంది. తాను తిరిగి భారత్ వెళతానని యజమానిని అడిగితే, ఏజెంట్‌కు తాను ఇచ్చిన డబ్బు కడితేనే పంపిస్తానని చెబుతున్నాడని ఆమె వాపోయింది. తనను యజమాని తీవ్రంగా వేధిస్తున్నాడని చంద్రబాబు, పవన్ కల్యాణ్ తనను కాపాడాలని కోరింది.

## స్విచ్‌లు నొక్కడం తప్ప జగన్ చేసిందేమీ లేదు: షర్మిల

విజయవాడ, మే 19 (ఈవార్తలు): వైసీపీ అధినేత, తన సోదరుడు జగన్ పై ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ ఆశయాలకు జగన్ తూట్లు పొడిచారని ఆమె ధ్వజమెత్తారు. వైఎస్సార్ పేరు చెప్పుకుని 'ఒక్క ఛాన్స్' అంటూ సీఎం అయిన జగన్, ఐదేళ్ల పాలనలో కేవలం స్విచ్‌లు నొక్కడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కేవలం బటన్లు నొక్కితే మళ్లీ మళ్లీ సీఎంలు కాలేరని, కనీసం ఎమ్మెల్యేలు, ఎంపీలకు కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వని పరిస్థితి నాడు ఉందని మండిపడ్డారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తండ్రి ఆశయాల పేరిట ఓట్లు వేయించుకుని, అధికారంలోకి వచ్చాక ఆ ఆశయాలనే జగన్ నాశనం చేశారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో ప్రజలపై భారాలు మోపిన వైసీపీ నేతలు, ఇప్పుడు ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. జగన్ సీఎం అయ్యాక కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తల ఊపుతూ, అక్రమ పొత్తు పెట్టుకున్నారని షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు.

## 31లోపు ధాన్యం మొత్తం కొనాలె

**కాంగ్రెస్ హామీలన్నీ బుట్టదాఖలు.. సర్కారుపై జీవన్ రెడ్డి విమర్శల జడి**

సారంగాపూర్, మే 19 (ఈవార్తలు): రైతులపై ప్రభుత్వం ఆర్ ఆర్ ట్యాక్స్ విధిస్తుందని, ధాన్యం సేకరణలో తీవ్ర వైఫల్యం చెందిందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి ఆరోపించారు. సారంగాపూర్ మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఇప్పటివరకు 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించారని, గత ఏడాది ఈ సమయానికి 3.45 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించారని తెలిపారు. 1.45 లక్షల మెట్రిక్ టన్నులు తక్కువగా సేకరించడం పాలనా వైఫల్యమేనన్నారు. కల్లాల్లో 17శాతం తేమతో తూకం వేసి, అన్లు 8-9శాతం చూపుతున్నారని ఆరోపించారు. దీనివల్ల క్వింటాల్కు 5 కేజీలు, అన్లోడ్ ఆలస్యంతో మరో 5 కేజీలు కలిపి మొత్తం 10 కేజీల నష్టం వస్తోందన్నారు. క్వింటాల్కు రూ.250 చొప్పున ఎకరాకు రూ.6,000 రైతు నష్టపోతున్నాడని లెక్కలతో వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.15,000 హామీ ఇచ్చి, కేవలం రూ.6,000 అదీ 2 ఎకరాలకే ఇస్తోందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యంతో రైతుకు అదనంగా ఎకరాకు రూ.6,000 నష్టం వస్తోందని, ఇచ్చే సాయం కంటే నష్టమే ఎక్కువని ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తే ప్రభుత్వం 42,000 మెట్రిక్ టన్నులకు మాత్రమే అనుమతి ఇచ్చిందని, దీనివల్ల క్వింటాల్కు రూ.500, ఎకరాకు రూ.10 వేలు నష్టం వస్తోందని తెలిపారు. మే 31లోపు ధాన్యం సేకరణ పూర్తి చేయాలని, జిల్లా ఇంచార్జ్ మంత్రి తుమ్మల నాగె శ్వరరావు జిల్లాలో క్యాంప్ చేసి పర్యవేక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఓపెన్ నెట్టింగ్కు అనుమతి ఇవ్వాలని, జగిత్యాల మార్కెట్లో ఖాళీగా ఉన్న 3 గోదాములను వినియోగించుకోవాలని కలెక్టర్ ను కోరామన్నారు.





## 50 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి

**జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ వెల్లడి**

జగిత్యాల బ్యూరో, మే 19 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో ఏర్పాటు చేసిన 441 కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చిన ధాన్యంలో 50 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. రైతులకు ఇప్పటివరకు రూ.353.71 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ సీజన్‌లో 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేయగా ఇప్పటివరకు 3.50 లక్షల మెట్రిక్ టన్నులు కేంద్రాలకు చేరాయని తెలిపారు. అందులో 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. అధికారుల సమన్వయంతో వారం రోజుల్లో రికార్డు స్థాయిలో దాదాపు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రానున్న వారంలో కూడా లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మొక్కజొన్న కొనుగోళ్లు కూడా సజావుగా కొనసాగుతున్నాయని, జిల్లాకు కేటాయించిన 1.60 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యంలో ఇప్పటివరకు 1.25 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా 80 శాతం కొనుగోళ్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.



## విద్యార్థుల భవిష్యత్‌తో రాజకీయమా?

**ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మండిపాటు**

జగిత్యాల బ్యూరో, మే 19 (ఈవార్తలు): విద్యార్థుల భవిష్యత్‌తో రాజకీయం చేయవద్దని, చల్గల్‌లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు తాము చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. స్థానిక ఎంపీ అర్వింద్ అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. మంగళవారం మోతె రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు విషయంలో ఎమ్మెల్యేతో పాటు స్థానిక ఎంపీకి కూడా బాధ్యత ఉంటుందని అన్నారు. ఇరిగేషన్ శాఖ మంత్రిని కలిసి విద్యాలయం కోసం స్థల కేటాయింపు విషయంలో చొరవ చూపాల్సిన బాధ్యత ఎంపీదేనని పేర్కొన్నారు. తాను పలుమార్లు సంబంధిత అధికారులను కలిసి ఐదు ఎకరాల స్థలం కేటాయించాలని వినతిపత్రాలు అందజేశానని గుర్తుచేశారు. కేంద్రీయ విద్యాలయం స్థలం సేకరణలో ఎమ్మెల్యే అసమర్థత గురించి మాట్లాడే ముందు, జగిత్యాల నియోజకవర్గానికి అవసరమైన జాతీయ రహదారులు, బ్లాక్ స్పాట్ రోడ్లు, వంతెనలు, జగన్నాథ్‌పూర్ బ్రిడ్జి వంటి అభివృద్ధి పనులకు కేంద్రం నుంచి నిధులు సాధించడంలో ఎంపీ పాత్రపై సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. చల్గల్‌లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కోసం చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేస్తున్నామని, స్థలం సాకుతో విద్యాలయాన్ని ఇతర ప్రాంతాలకు తరలించే ఆలోచనలు చేయవద్దని హితవు పలికారు. టీఆర్ నగర్ టీచర్స్ కాలనీ సమీపంలో జాతీయ రహదారికి 200 మీటర్ల దూరంలో ఆరు ఎకరాల స్థలం సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం వరి, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియ ప్రధాన సమస్యగా మారిందని, ఎఫ్‌సీఐ ధాన్యం సేకరణలో జాప్యం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గడిచిన ఆరు నెలల్లో ఎఫ్‌సీఐ ద్వారా ఎంత ధాన్యం సేకరించారో కేంద్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సమయంలో వాణి శ్రీనివాస్, టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందుల్లేవ్: సంగనభట్ల

ధర్మపురి, మే 19 (ఈవార్తలు): ధర్మపురి మండలంతో పాటు నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేవని జగిత్యాల జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ సంగనభట్ల దినేష్ తెలిపారు. ఈసారి రైతులు అధిక దిగుబడి సాధించడం వల్ల కొనుగోళ్లలో కొంత జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సంగ నర్సింహులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, రైతులకు సంకెళ్లు వేసిన ప్రభుత్వం బీఆర్ఎస్‌దేనని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతిగా పనిచేస్తోందని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటోందన్నారు. కమిషన్ల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన వారు ఇప్పుడు కమిషన్ల గురించి మాట్లాడటం సరికాదని విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌పై స్థాయిని మరిచి విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ప్రజాప్రతినిధులపై గౌరవంగా మాట్లాడే సంస్కారం అలవర్చుకోవాలని సూచించారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి వరి దిగుబడి అధికంగా రావడంతో కొనుగోళ్ల ప్రక్రియపై కొంత ఒత్తిడి ఏర్పడిందన్నారు. మార్కెట్ యార్డులో వరి, మొక్కజొన్న కొనుగోళ్లు ఏకకాలంలో కొనసాగుతున్నాయని తెలిపారు. రైతుల సౌకర్యార్థం మార్కెట్ యార్డులో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. గతంలో తప్పుడు తూకాల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేశారని, ప్రస్తుతం రైతుల అంగీకారంతో 42 కిలోల ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.

## అడ్లూరికి సరస్వతి పుష్కరాల ఆహ్వానం

హైదరాబాద్, మే 19 (ఈవార్తలు): ఈ నెల 21వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న సరస్వతి అంత్య పుష్కరాల మహోత్సవాలకు హాజరుకావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు హైదరాబాద్‌లో ఆహ్వాన పత్రికను అందజేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పవిత్ర త్రివేణి సంగమ క్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం వద్ద మే 21 నుంచి జూన్ 1 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్న "సరస్వతి అంత్య పుష్కరాల" మహోత్సవాల్లో పాల్గొనాల్సిందిగా కోరారు.



## లవ్లీ చిత్రం






## యూట్యూబ్‌లో 'పెద్ది' రికార్డులు

టాలీవుడ్ లో ఇప్పటివరకు ఉన్న వ్యూస్ రికార్డులను తిరగరాస్తూ రామ్ చరణ్ 'పెద్ది' సినిమా సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది. ముంబై వేదికగా విడుదలైన ఈ చిత్రం అఫీషియల్ ట్రైలర్ కు సోషల్ మీడియాలో భారీ రెస్పాన్స్ వచ్చింది. కేవలం 24 గంటల టైమ్ లోనే అన్ని భాషల్లో కలిపి ఏకంగా 101 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి టాలీవుడ్ లోనే అత్యధిక వ్యూస్ సాధించిన ట్రైలర్ లలో ఒకటిగా నిలిచింది. ఇండియా మొత్తం మీద ప్రస్తుతం ఈ ట్రైలర్ నంబర్ వన్ పొజిషన్ లో ట్రెండ్ అవుతోంది. ముంబైలో జరిగిన లాంచ్ ఈవెంట్ తర్వాత నేషనల్ మీడియా కూడా చరణ్ రగ్గడ్ లుక్ కి ఫుల్ గా కనెక్ట్ అయింది. ఈ మూడు నిమిషాల కట్ లో రామ్ చరణ్ విభిన్న క్రీడల్లో కనిపించిన విధానం, ఆయన బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ఒక పవర్ఫుల్ అథ్లెట్ గా చరణ్ చూపించిన ఇంటెన్సిటీ, అందులోని ఎమోషన్స్ సినిమాపై అంచనాలను పెంచేలా ఉన్నాయి. కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా పల్లెటూరి నేపథ్యంలో సాగే బలమైన కథ ఇందులో ఉందని విజువల్స్ చూస్తే అర్థమవుతోంది. ఈ రకమైన రికార్డ్ వసూళ్ల వేటను చూస్తుంటే జూన్ 4న థియేటర్లలో పూనకాలు రావడం ఖాయమని ట్రేడ్ వర్గాలు లెక్కలు వేస్తున్నాయి. నార్త్, సౌత్ అనే తేడా లేకుండా ఇండస్ట్రీ రికార్డులను షేక్ చేస్తున్న ఈ ట్రైలర్, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ లో సరికొత్త రికార్డులను సెట్ చేస్తోంది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతున్న ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి వండర్స్ క్రియేట్ చేస్తుందో చూడాలి.



## నా భార్య రాజకీయాల్లోకి వస్తుంది: మంచు మనోజ్

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకోబోతోంది. నటుడు మంచు మనోజ్ భార్య, భూమా కుటుంబ వారసురాలు భూమా మౌనిక రెడ్డి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. రేపు తన పుట్టినరోజు ఉన్న సందర్భంగా ఇవాళ హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో మనోజ్ ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ప్రస్తుతం తాము యాక్టివ్ పాలిటిక్స్ లో భాగమయ్యామని, మౌనిక ఎన్నికల బరిలోకి దిగడం దాదాపు ఖాయమని స్పష్టం చేయడంతో ఏపీ రాజకీయ వర్గాల్లో సరికొత్త చర్చ మొదలైంది. గత ఎన్నికల ప్రచార సమయంలోనే మౌనిక యాక్టివ్ గా తిరగడం చూసి జనాలు ఆమె రాజకీయ ఎంట్రీని ముందే ఊహించారని మనోజ్ చెప్పారు. ఇప్పుడు ఆ అంచనాలకు తగ్గట్టే ఆమె ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడానికి గ్రౌండ్ వర్క్ చేసుకుంటున్నట్లు తెలిపారు. రాయలసీమ రాజకీయాల్లో భూమా కుటుంబానికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. నాగిరెడ్డి, శోభా నాగిరెడ్డిల వారసత్వాన్ని కొనసాగిస్తూ మౌనిక, ఇప్పుడు మళ్లీ ఆ పాత వైభవాన్ని నిలబెట్టేలా ప్రజా క్షేత్రంలోకి వెళ్లాలని డిసైడ్ అయ్యారని తెలుస్తోంది.



## మీ జీవితానికి మీరే హీరో అవ్వండి: కంగనా

బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ ఓవైపు రాజకీయాల్లో రాణిస్తూనే, మరోవైపు సినిమాల్లోనూ నటిస్తూ దూసుకుపోతోంది. అంతేకాకుండా సోషల్ మీడియాలో కూడా ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ, సమాజంలో జరిగే పలు విషయాలపై తనదైన శైలిలో స్పందిస్తూ ఉంటుంది. తాజాగా, కంగనా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా నేటి తరం యువతులకు కొన్ని అత్యంత కీలకమైన సూచనలు చేసింది. "ఈ రోజుల్లో ప్రతిరోజూ ఎంతోమంది వివాహితలు, యువతుల జీవితాల్లోని కష్టాలు వెలుగులోకి వస్తున్నాయి. చదువుకున్న చాలామంది యువతులు తమ జీవితాలు పూర్తిగా నాశనం కాకముందే.. ఊపిరాడనంతటి క్లిష్ట పరిస్థితుల నుండి తమను బయటపడేయమని కన్నతల్లిదండ్రులను వేడుకుంటున్నారు. కానీ, మన భారతీయ సమాజంలో కూతుళ్లకు పెళ్లి చేసిన తర్వాత వారిని పూర్తిగా వదిలివేయడంలో ఒక చెడ్డ పేరుంది" అని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ సమస్యలపై యువతులకు సలహా ఇస్తూ.. "సోషల్ మీడియా గానీ, ఫ్యాషన్, డేటింగ్, పెళ్లి లేదా మేకప్ పరిశ్రమలు ఏవీ కూడా మీకు ఈ నిజాన్ని చెప్పవు. మీ జీవితంలో మరేదాని కంటే కూడా మీ కెరీర్, మీ ఆర్థిక స్వాతంత్ర్యం చాలా ముఖ్యం. మీరు సొంతంగా నిలబడి, స్వతంత్రంగా మారిన తర్వాతే పెళ్లి గురించి ఆలోచించండి. దయచేసి మీ జీవితానికి మీరే హీరోగా మారాలి. మీరు రేపు ఎవరిని పెళ్లి చేసుకోబోతున్నారు అనే దానికంటే.. ప్రస్తుతం మీరు ఏం చేస్తున్నారు, సమాజంలో మీ గుర్తింపు ఏంటి అనేదే చాలా ముఖ్యం.

## టాలీవుడ్‌కు శ్రీలీల దూరం!

టాలీవుడ్ లో చాలా తక్కువ సమయంలో స్టార్ హీరోయిన్ గా ఎదిగిన బ్యూటీల్లో శ్రీలీల పేరు కచ్చితంగా ముందుంటుంది. తనదైన అందం, డాన్స్, ఎనర్జీ, స్క్రీన్ ప్రెజెన్స్ తో యూత్ లో మంచి క్రేజ్ సంపాదించుకున్న ఆమె కెరీర్ పై ఇప్పుడు అందరి దృష్టి పడింది. వరుస సినిమాలతో దూసుకెళ్లిన శ్రీలీల ప్రస్తుతం తెలుగులో ఒక్క సినిమా కూడా చేయకపోవడం హాట్ టాపిక్ గా మారింది. నిజానికి.. శ్రీలీల ఎంబీబీఎస్ చదువుకుంటూనే సినిమాల్లోకి అడుగు పెట్టింది. 2019లో వచ్చిన కన్నడ చిత్రం కిస్ తో హీరోయిన్ గా పరిచయమయ్యారు. తొలి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమెకు సైమా బెస్ట్ డెబ్యూ హీరోయిన్ అవార్డు దక్కింది. ఆ తర్వాత దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు పర్యవేక్షణలో రూపొందిన పెళ్లి సందడితో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన ఆమె.. ఒక్కసారిగా అందరి దృష్టిలో పడ్డారు. అయితే శ్రీలీల కెరీర్ కు అసలు టర్నింగ్ పాయింట్ గా నిలిచింది ధమాకా. ముఖ్యంగా పల్సర్ బైక్ పాటలో ఆమె వేసిన స్టెప్పులకు అంతా ఫిదా అయ్యారు. ఆ ఒక్క సినిమాతోనే ఆమె స్టార్ హీరోల సరసన అవకాశాలు అందుకుంది. బాలకృష్ణ భగవంత్ కేసరిలో విజ్జి పాప పాత్రలో నటించి నటిగా కూడా ప్రశంసలు అందుకుంది. కేవలం గ్లామర్ మాత్రమే కాదు, ఎమోషనల్ సీన్స్ కూడా బాగా చేయగలనని ప్రూవ్ చేసుకున్నారు. ఆ తర్వాత గుంటూరు కారం వంటి భారీ చిత్రంలో నటించే అవకాశం దక్కించుకున్న అమ్మడు.. అలాగే పవన్ కళ్యాణ్ తో ఉస్తాద్ భగత్ సింగ్ లో కనిపించారు..



## వారసత్వం ఉన్నా కష్టపడాల్సిందే: సాయి మంజ్రేకర్

సినీ పరిశ్రమలో నటవారసత్వం అనే అంశంపై ఎప్పటికీ ముగింపు లేని చర్చ సాగుతూనే ఉంది. చిత్రపరిశ్రమ బయటి నుంచి వచ్చే నటీనటులకు అవకాశాలు దక్కడం లేదనే విమర్శలు ఒకవైపు ఉంటే.. స్టార్ కిడ్స్‌గా ఎదగడం వెనుక కూడా ఎన్నో సవాళ్లు, మానసిక ఒత్తిళ్లు ఉంటాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే సీనియర్ నటి సోనాక్షి సిన్హా ఇటీవలే నేపోటిజంపై ఘాటు వ్యాఖ్యలు చేస్తూ.. కేవలం సినీ వారసత్వం ఉన్నంత మాత్రాన అవకాశాలు రావని.. తమను తాము నిరూపించుకునేందుకు ఇండస్ట్రీ కిడ్స్ కూడా ఎంతో శ్రమించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పుడు ఇదే అభిప్రాయాన్ని మరో స్టార్ కిడ్, టాలెంట్ ఉన్న నటి సాయి మంజ్రేకర్ కూడా కుండబద్దలు కొట్టడం గమనార్హం. నటుడు, దర్శకుడు మహేష్ మంజ్రేకర్ కుమార్తె అయిన సాయి.. అడివి శేష్ సరసన -మేజర్- చిత్రంలో



తన నటనతో ఇప్పటికే ప్రేక్షకులను మెప్పించి.. వారసత్వపు ముద్రను దాటి తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకునే ప్రయత్నంలో ఉన్నారు. సాయి మంజ్రేకర్ ప్రకారం..సినీ పరిశ్రమలో పాపులర్ కుటుంబానికి చెందిన ఇంటిపేరు ఉండటం అనేది కేవలం ప్రారంభంలో కొన్ని పరిచయాలకు లేదా మొదటి సినిమా తలుపులు తెరవడానికి మాత్రమే సహాయపడుతుంది. అంతకుమించి అది కెరీర్‌లో నిరంతర అవకాశాలను గానీ..బాక్సాఫీస్ విజయాలను గానీ పక్కాగా గ్యారెంటీ ఇవ్వదు. వెండితెరపై ఒక నటిగా ప్రేక్షకులతో కనెక్ట్ కానప్పుడు.. జనాలు మన నటనను అంగీకరించనప్పుడు వెనుక ఎంతటి పెద్ద బ్యాక్‌గ్రౌండ్ ఉన్నా.. గ్లామర్ ప్రపంచంలో ఎక్కువ కాలం మనుగడ సాగించడం అసాధ్యం.

## భాగ్యశ్రీకి కోలీవుడ్ వరద

అందం, అభినయం రెంటితోనూ ఆకట్టుకున్నప్పటికీ.. కొందరు హీరోయిన్లకు అదృష్టం కలిసి రాదు. వరుసగా అవకాశాలు వస్తున్నా.. సినిమాలు హిట్ కావు. ముంబయి భామ భాగ్యశ్రీ బోర్సే పరిస్థితి ఇదే. ఇప్పటికే ఆమె తెలుగు, తమిళ భాషల్లో నాలుగు సినిమాలు చేసింది. అందులో తెలుగులో నటించిన సినిమాలు.. మిస్టర్ బచ్చన్, కింగ్డమ్, ఆంధ్ర కింగ్ తాలూకా. తమిళంలో 'కాంత' అనే సినిమాలో నటించింది. కానీ వీటిలో ఏదీ కమర్షియల్ సక్సెస్ కాలేదు. మిస్టర్ బచ్చన్ మినహాయిస్తే మిగతా మూడూ పర్వాలేదనిపించే సినిమాలే. కానీ ఆడలేదు. ఐతే తెలుగులో హ్యాట్రిక్ ఫ్లాపులు కొట్టినా భాగ్యశ్రీకి అవకాశాలేమీ ఆగిపోలేదు. 'లెనిన్'లో నటిస్తోంది. మరో సినిమాకు కూడా తన పేరును పరిశీలిస్తున్నారు. తమిళంలో మాత్రం 'కాంత' తర్వాత ఆమెకు బ్రేక్ వచ్చింది. ఐతే ఇప్పుడు భాగ్యశ్రీకి అక్కడా ఇంకో ఛాన్స్ లభించింది. శివ కార్తికేయన్ లాంటి స్టార్ హీరో సరసన భాగ్యశ్రీని కథానాయికగా ఎంచుకున్నారు.








# గిల్‌కు కెప్టెన్సీ

## కొత్త ముఖాలకు చోటు.. ఆఫ్ఘనిస్థాన్ సిరీస్‌కు భారత జట్టు ప్రకటన

జూన్ 6 నుంచి ఆఫ్ఘనిస్థాన్ తో జరగబోయే ఏకైక టెస్ట్ మ్యాచ్, మూడు వన్డేల సిరీస్ కోసం బీసీసీఐ భారత జట్టును ప్రకటించింది. ఈ టూర్‌లో టెస్ట్‌తో పాటు వన్డే జట్టుకు కెప్టెన్‌గా యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ వ్యవహరించనున్నాడు. టెస్ట్‌కు వైస్ కెప్టెన్ బాధ్యతలను కేఎల్ రాహుల్‌కు అప్పగించారు. ఆంధ్రా క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి టెస్టు, వన్డే జట్లకు రెండింటికీ ఎంపికయ్యాడు. వన్డే జట్టులోకి శ్రేయస్ అయ్యర్ తిరిగి రావడమే కాకుండా వైస్ కెప్టెన్ బాధ్యతలనూ దక్కించుకున్నాడు. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీని వన్డే జట్టుకు ఎంపిక చేశారు. అయితే రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా ఎంపిక వారి ఫిట్‌నెస్ ఆధారంగానే ఖరారవుతుందని సెలెక్టర్లు స్పష్టం చేశారు. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతి కల్పించారు. ఈ సిరీస్ ద్వారా హర్ష్ దూబే, గుర్నూర్ బ్రార్ టెస్టులు, వన్డేల్లో అరంగేట్రం చేయనుండగా.. ప్రిన్స్ యాదవ్ వన్డేల్లో అరంగేట్రం చేయనున్నాడు. మానవ్ సుతార్ టెస్టుల్లో అరంగేట్రం చేయనున్నాడు.



**వన్డే జట్టు:**
శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ (ఫిట్‌నెస్ ఆధారంగా), విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్, నితీశ్ కుమార్ రెడ్డి, హార్దిక్ పాండ్యా (ఫిట్‌నెస్ ఆధారంగా), ప్రిన్స్ యాదవ్, హర్ష్ దూబే, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, గుర్నూర్ బ్రార్

**టెస్ట్ జట్టు:**
శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), రిషభ్ పంత్ (వికెట్ కీపర్), సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, నితీశ్ కుమార్ రెడ్డి, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, మహ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, మానవ్ సుతార్, హర్ష్ దూబే, గుర్నూర్ బ్రార్




# భారత్‌లో బీబీఎల్ మ్యాచ్‌లు

ఆస్ట్రేలియాకు చెందిన ప్రఖ్యాత టీ20 లీగ్, బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్) మ్యాచ్‌ను భారత్‌లో నిర్వహించేందుకు సన్నాహాలు వేగవంతమయ్యాయి. ఈ ఏడాది డిసెంబర్‌లో చెన్నైలోని ఎంఏ చిదంబరం (చెపాక్) స్టేడియంలో బీబీఎల్ 2026-27 సీజన్‌కు చెందిన ఒక మ్యాచ్‌ను నిర్వహించే ప్రతిపాదనపై బీసీసీఐ, క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ), తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ (టీఎన్‌సీఏ) మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయి. ఈ మూడు సంస్థల మధ్య అధికారిక ఒప్పందం ఇంకా ఖరారు కానప్పటికీ, మిగిలిన ప్రక్రియలన్నీ కేవలం పరిపాలనాపరమైనవేనని సంబంధిత అధికారులు భావిస్తున్నారు. భారత్, ఆస్ట్రేలియా ప్రభుత్వాల మధ్య క్రీడా సహకార కార్యక్రమాల్లో భాగంగా ఈ ప్రతిపాదనకు ఇరు దేశాల ప్రభుత్వాల మద్దతు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు 'క్రిక్‌బజ్' ఒక కథనాన్ని ప్రచురించింది. క్రిక్‌బజ్ కథనం ప్రకారం, ఇటీవల క్రికెట్ ఆస్ట్రేలియా, బీబీఎల్ ప్రతినిధుల బృందం చెన్నైలో పర్యటించి చెపాక్ స్టేడియంలోని సౌకర్యాలను పరిశీలించింది. ఈ మ్యాచ్‌ను డిసెంబర్ రెండో లేదా మూడో వారంలో నిర్వహించే అవకాశం ఉంది. "ఇంకొన్ని వారాల్లో క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి స్పష్టత వస్తుంది. వారి సభ్యులు ఐపీఎల్ మ్యాచ్‌కు హాజరయ్యారు. పూర్తి సమాచారంతో మళ్లీ సంప్రదిస్తామని చెప్పారు" అని టీఎన్‌సీఏ అధికారి ఒకరు తెలిపినట్టు ఆ కథనం పేర్కొంది. సోమవారం చెన్నైలో జరిగిన ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మిన్హాస్, తాత్కాలిక సీఈఓ హేమాంగ్ అమిన్ కూడా సీఏ ప్రతినిధులతో చర్చల్లో పాల్గొన్నారు. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే, భారత గడ్డపై ఒక విదేశీ ఫ్రాంచైజీ టీ20 లీగ్ మ్యాచ్ జరగడం ఇదే తొలిసారి అవుతుంది. ఇది భవిష్యత్తులో మరిన్ని క్రాస్-లీగ్ సహకారాలకు మార్గం సుగమం చేస్తుందని భావిస్తున్నారు.

## ధోనీ 2027లోనూ ఆడాలని ఉందన్నాడు: రైనా

చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) దిగ్గజం ఎం.ఎస్ ధోనీ ఐపీఎల్ భవిష్యత్తుపై సస్పెన్స్ ఇంకా కొనసాగుతూనే ఉంది. అయితే ఆయన వచ్చే సీజన్‌లోనూ ఆడాలని సీఎస్‌కే మాజీ స్టార్ సురేష్ రైనా ఆకాంక్షించాడు. చెపాక్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై ఓటమి తర్వాత 'స్టార్ స్పోర్ట్స్'తో రైనా మాట్లాడాడు. ఈ సందర్భంగా ధోనీ రిటైర్మెంట్‌పై వారిద్దరి మధ్య జరిగిన ఒక సంభాషణను పంచుకున్నాడు. "నేను ధోనీతో మాట్లాడాను. నువ్వు ఐపీఎల్ 2026 సీజన్‌కు కేవలం మిస్డ్‌కాల్ ఇచ్చావంతే. ఇది లెక్కలోకి రాదు. వచ్చే ఏడాది కచ్చితంగా ఆడాల్సిందేనని నేను అతడితో అన్నాను" అని రైనా వెల్లడించాడు. దానికి ధోనీ స్పందిస్తూ.. "నా శరీరం కొంచెం బలహీనంగా అనిపిస్తోంది" అన్నాడని రైనా తెలిపాడు. అయితే "మేం అవేమీ నమ్మం. నువ్వు వచ్చే ఏడాది ఆడాల్సిందేనని నేను స్పష్టం చేశాను" అని రైనా వెల్లడించాడు. ఇది ధోనీ వ్యక్తిగత నిర్ణయమైనప్పటికీ అతను మాత్రం పాజిటివ్‌గానే ఉన్నట్లు తనకు అనిపించిందని తెలిపాడు. ధోనీ ఈ సీజన్ మొత్తం తుది జట్టులో లేడు. కనీసం స్టేడియంలో కూడా కనిపించలేదు. కానీ నిన్న అతణ్ని చెపాక్‌లో చూసి ఫ్యాన్స్ భావోద్వేగానికి గురయ్యారు. టీమ్ ఫొటోగ్రాఫ్ కోసం మైదానంలోకి రాగానే స్టేడియం దద్దరిల్లింది. ఎలాంటి స్పీచ్ ఇవ్వకుండానే, బౌండరీ లైన్ వెంట నడుస్తూ అభిమానులకు అభివాదం చేశాడు.



**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| బెంగళూరు | 13 | 9 | 4 | 18 |
| గుజరాత్ | 13 | 8 | 5 | 16 |
| హైదరాబాద్ | 13 | 8 | 5 | 16 |
| రాజస్థాన్ | 13 | 7 | 6 | 14 |
| పంజాబ్ | 13 | 6 | 6 | 13 |
| చెన్నై | 13 | 6 | 7 | 12 |
| ఢిల్లీ | 13 | 6 | 7 | 12 |
| కోల్‌కతా | 12 | 5 | 6 | 11 |
| ముంబై | 12 | 4 | 8 | 8 |
| లక్నో | 13 | 4 | 9 | 8 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ- ఓడినవి పా- పాయింట్లు

# ముంబైకి డబుల్ షాక్

పేలవమైన ఆటతో ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన ముంబై ఇండియన్స్‌కు డబుల్ స్ట్రోక్ తగిలింది. ఓపెనర్ క్వింటన్ డికాక్, ఆల్‌రౌండర్ రాజ్ అంగద్ బవా ఐపీఎల్ నుంచి వైదొలిగారు. గాయంతో బాధ పడుతున్న ఈ ఇద్దరూ మిగతా రెండు మ్యాచులకు దూరమయ్యారు. ఈ విషయాన్ని ముంబై ఫ్రాంచైజీ ఎక్స్ వేదికగా వెల్లడించింది. పంతొమ్మిదో సీజన్‌లో తీవ్రంగా నిరాశపరిచి.. 11 మ్యాచుల్లో 7 ఓటములతో ఎలిమేట్ అయిన ముంబై ఇండియన్స్ ఇద్దరు కీలక ఆటగాళ్ల సేవల్ని కోల్పోయింది. విధ్వంసక ఓపెనర్ క్వింటన్ డికాక్, పేస్ ఆల్‌రౌండర్ రాజ్ బవా గాయంతో అనూహ్యంగా టోర్నీ నుంచి నిష్క్రమించారు. సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌కు ముందు నెట్స్‌లో డికాక్ గాయపడ్డాడు. అతడి ఎడమ చేతి మణికట్టు నరం దెబ్బతినడంతో ఇబ్బందిపడ్డాడు. రాజ్ బవా విషయానికొస్తే.. కుడి బొటనవేలు నరంలో చీలిక వచ్చింది. దాంతో.. ముంబై తదుపరి మ్యాచ్‌లకు వీరు అందుబాటులో ఉండడం లేదు. గాయం నుంచి కోలుకునేందుకు డికాక్ స్వదేశం(దక్షిణాఫ్రికా) వెళ్లగా.. రాజ్ బవా ఛండీగఢ్ చేరుకున్నాడు. నాకౌట్ చేరని ముంబై పోతూపోతూ ఇతర జట్ల అవకాశాల్ని దెబ్బతీయనుంది.

# వైభవ్ ఊచకోత

## బలైన లక్నో.. పంజాబ్ డౌన్.. రాజస్థాన్ పైకి

చావోరేవో పోరులో వైభవ్ సూర్యవంశీ(93) ఊచకోతకు లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లు బలయ్యారు. వైభవ్ విధ్వంసంతో ప్లే ఆఫ్స్ చివరి బెర్తుపై కన్నేసిన రాజస్థాన్ రాయల్స్‌కు కీలకమైన రెండు పాయింట్లు వచ్చాయి. జైపూర్‌లో లక్నో బౌలర్లపై తుఫాన్‌లా విరుచుకుపడిన వైభవ్.. భారీ అర్ధ శతకంతో లక్ష్యాన్ని మంచుముక్కలా కరిగించాడు. యశస్వీ(43) కెప్టెన్ ఇన్నింగ్స్‌కు, జురెల్(53 నాటౌట్) మెరుపులు తోడవ్వగా రాజస్థాన్ అదిరే విజయంతో పంజాబ్ కింగ్స్‌ను వెనక్కి నెట్టి నాలుగో స్థానానికి ఎగబాకింది. ప్లే ఆఫ్స్‌లో నిలవాలంటే గెలవ తప్పని మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ పంజా విసిరింది. హ్యాట్రిక్ ఓటముల నుంచి తేరుకుంటూ అదిరే విజయంతో నాకౌట్ ఆశల్ని సజీవంగా ఉంచుకుంది. లక్నో నిర్దేశించిన 221 పరుగుల భారీ ఛేదనలోఆశ్చర్యంగా వైభవ్ సూర్యవంశీ(93 38 బంతుల్లో 7 ఫోర్లు, 10 సిక్సర్లు) బదులు ఓపెనర్ యశస్వీ జైస్వాల్(43) చితక్కొట్టాడు. తొలి ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లు.. ఆపై మొహ్సిన్ ఓవర్లో సిక్స్, మూడు ఫోర్లతో 19 పరుగులు పిండుకున్నాడు. మొదట్లో టైమింగ్ కుదరక నెమ్మదించిన వైభవ్ పవర్ ప్లే ఆఖరి ఓవర్లో రెండు ఫోర్లు, సిక్సర్ బాదగా రాజస్థాన్ అజేయంగా 71 పరుగులు చేసింది. చెలరేగుతున్న యశస్వీని ఔట్ చేసి ఈ జోడీని ఆకాశ్ విడదీశాడు. లక్నోకు తొలి వికెట్ అందించిన ఆకాశ్‌కు చుక్కలు చూపిస్తూ.. 6, 4, 4, 6, 4 తో 26 రన్స్ రాబట్టి 23 బంతుల్లో అర్ధ శతకం సాధించాడు వైభవ్. ఆ తర్వాత మరింత ఉతికేసిన చిచ్చరపిడుగు ధ్రువ్ జురెల్(53 నాటౌట్)తో కలిసి లక్ష్యాన్ని కరిగించాడు. 92 పరుగుల వద్ద మొహ్సిన్ పొరపాటుతో రనౌట్ తప్పించుకున్నాడు. కానీ, అదే ఓవర్లో సమద్ చేతికి చిక్కాడు. అప్పటికే రాజస్థాన్ విజయానికి చేరువవ్వగా జురెల్, ఫెరీరా(16 నాటౌట్)లు లాంఛనం పూర్తి చేశారు. ఫెరీరా సిక్సర్‌తో 7 వికెట్ల తేడాతో గెలుపొందిన రాజస్థాన్ ప్లే ఆఫ్స్ పోటీలో నిలిచింది. టాస్ ఓడిన లక్నోకు ఓపెనర్లు మిచెల్ మార్ష్(96), జోష్ ఇంగ్లిస్(60)లు మెరుపు ఆరంభాన్నిచ్చారు. జైపూర్ మైదానంలో ప్రేక్షకులను అలరిస్తూ రాజస్థాన్ బౌలర్లను బెంబేలెత్తిస్తూ ఇద్దరూ పోటీపడి బౌండరీలు బాదారు. దాంతో, పవర్ ప్లలోనే స్కోర్ 80 దాటింది. పిడుగుల్లే విరుచుకుపడిన ఇంగ్లిస్‌ను బౌల్డ్ చేసిన యశ్ రాజ్ ఎట్టకేలకు ఈ జోడీని విడదీసి రాజస్థాన్‌కు ఉపశమనమనమిచ్చాడు. ఇంగ్లిస్ ఔటైనా మార్ష్ జోరు తగ్గించలేదు. రాజస్థాన్ పేలవ ఫీల్డింగ్ కూడా కలిసి రావడంతో.. పూరన్(16), కెప్టెన్ రిషభ్ పంత్(35)లతో కీలక భాగస్వామ్యం నెలకొల్పిన మార్ష్ స్కోర్ రెండొందలు దాటించాడు. కానీ, ఆర్చర్ వేసిన ఆఖరి ఓవర్లో మార్ష్, పంత్ రనౌటవ్వగా.. అయుశ్ బదోనీ(0) బౌల్డయ్యాడు. టపటపా మూడు వికెట్లు పడడంతో లక్నో నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది.






# నిజమైన సీనియర్ అంటే కోహ్లీనే: పీవీ సింధు

భారత క్రీడారంగంలోని ఇద్దరు దిగ్గజాలు, క్రికెటర్ విరాట్ కోహ్లీ, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ఒకే వేదికపై కలిశారు. ఈ సందర్భంగా విరాట్ కోహ్లీపై సింధు తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక భావోద్వేగ పోస్ట్ పెట్టారు. మంగళవారం బెంగళూరులో జరిగిన 'ఆర్సీబీ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియన్ స్పోర్ట్స్ సమ్మిట్'లో వీరిద్దరూ కలుసుకున్నారు. "నాకు మార్గనిర్దేశం అవసరమైన ప్రతిసారీ, మీరు సరైన సలహాలు, మాటలతో నా పక్కన నిలిచారు. భారత క్రీడారంగంలో నిజమైన సీనియర్ ఎలా ఉండాలో చెప్పడానికి మీకంటే గొప్ప ఉదాహరణ లేదు. మీరు ఎంతో ఉదారంగా, వినయంగా, స్ఫూర్తిదాయకంగా ఉంటారు. ఇతరులను ప్రోత్సహించడానికి ఎప్పుడూ ముందుంటారు. 'ఎప్పుడూ వెనక్కి తగ్గకు పీవీ' అని మీరు చెప్పిన మాటను నేను స్వీకరించాను. మీలాంటి వ్యక్తుల వల్లే భారత క్రీడారంగం మెరుగ్గా ఉంది" అని సింధు తన పోస్ట్‌లో పేర్కొంది. కోహ్లీతో దిగిన ఫొటోను కూడా ఆమె పంచుకోగా, అది సోషల్ మీడియాలో వైరల్ అయింది. గాయాల కారణంగా కొంతకాలంగా ఇబ్బంది పడుతున్న సింధు, ప్రస్తుతం తిరిగి ఫామ్‌లోకి వస్తోంది. ఈ నెలలో జరిగిన థాయ్‌లాండ్ ఓపెన్‌లో ఆమె క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. మరోవైపు, కోహ్లీ ఐపీఎల్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టును ప్లేఆఫ్స్‌కు చేర్చడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ టోర్నీలో కోల్‌కతా నైట్ రైడర్స్‌పై సెంచరీతో జట్టును గెలిపించాడు. క్రీడాకారుల ప్రదర్శన, నాయకత్వ లక్షణాలు, మానసిక ఆరోగ్యం వంటి అంశాలపై చర్చించేందుకు ఆర్సీబీ ఈ సదస్సును నిర్వహించింది. ఇందులో కోహ్లీ కీలక వక్తగా పాల్గొని తన అనుభవాలను పంచుకున్నారు. ఈ నేపథ్యంలోనే సింధు, కోహ్లీల భేటీ జరిగింది.

నేటి ఈవార్తలు
సంపాదకీయం
Editorial

# కబీర్ దాసు మార్గం.. నేటి సమాజానికి దిక్సూచి

క్రీస్తు శకం 15వ శతాబ్దపు భక్తి ఉద్యమ కాలంలో జీవించిన సంత్ కబీర్ దాసు వ్యక్తిత్వం, ఆధ్యాత్మికత 21వ శతాబ్దపు ఆధునిక సమాజానికి అత్యంత ఆవశ్యకమైన మార్గదర్శకాలు. సాంకేతికతతో ప్రపంచం ఒక గ్లోబల్ విలేజ్‌గా మారినప్పటికీ, మనుషుల మధ్య అంతరాలు, మతపరమైన విద్వేషాలు, కుల వివక్ష ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇటువంటి సంక్లిష్ట కాలంలో, 500 ఏళ్ల క్రితమే కబీర్ అందించిన మానవతా సందేశం నేటి సామాజిక రుగ్మతలకు సరైన చికిత్సగా పనిచేస్తుంది. కబీర్ దాసు కేవలం ఒక కవి మాత్రమే కాదు; ఆయన ఒక గొప్ప సామాజిక సంస్కర్త, సమతా ఉద్యమకారుడు. నిరాడంబరమైన చేనేత వృత్తిని చేస్తూ, సమాజంలో ఉన్న మూఢనమ్మకాలను, ఆడంబరాలను ఆయన తీవ్రంగా నిరసించారు. పుట్టుకతో ఎవరూ గొప్పవారు కారని, గుణమే మనిషిని మహోన్నతుడిగా మారుస్తుందని కబీర్ బలంగా నమ్మారు. కుల వివక్ష ఇంకా వేళ్లూనుకుని ఉన్న నేటి సమాజానికి ఈ సమతా దృక్పథం ఎంతో అవసరం. పాండిత్య ప్రకర్షలకు పోకుండా, సామాన్య ప్రజలకు అర్థమయ్యే సరళమైన 'దోహాలు' (పద్యాలు) ద్వారా సామాజిక స్పృహను కల్పించారు. సమాజంలోని అన్యాయాలను, మత గురువుల వేషధారణలను ముక్కుసూటిగా, నిర్భయంగా ప్రశ్నించే తత్వం ఆయన వ్యక్తిత్వంలో ప్రధానమైనది. కబీర్ దాసు ఆధ్యాత్మికత రూపరహితమైనది, విశ్వజనీనమైనది. ఆయన భగవంతుడిని బాహ్య ప్రపంచంలో కాకుండా మానవుని అంతరంగంలోనే వెతకాలని ప్రబోధించారు (నిర్గుణ భక్తి). హిందూ-ముస్లిం సమాజాల రెండింటి ప్రభావం ఉన్న కబీర్, మతం పేరిట జరిగే విభజనలను వ్యతిరేకించారు. రాముడైనా, రహీమైనా ఒక్కటేనని చాటిన ఆయన తత్వం, నేటి మత ఘర్షణల నివారణకు పరమౌషధం. గుళ్లు, మసీదులు తిరగడం వల్ల లేదా కఠినమైన పూజలు, ఆచారాలు చేయడం వల్ల దేవుడు లభించడని, స్వచ్ఛమైన ప్రేమతోనే భగవంతుడిని చేరుకోగలమని చెప్పారు. 'పుస్తకాలు చదివి చదివి ప్రపంచం అలసిపోయింది, కానీ ఎవరూ పండితులు కాలేదు; ప్రేమ అనే రెండున్నర అక్షరాలను చదివినవాడే నిజమైన పండితుడు' అన్న కబీర్ మాటలు నేటి యాంత్రిక జీవనంలో ప్రేమ, కరుణల ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తున్నాయి. ప్రస్తుత సమాజం భౌతిక సుఖాల వెనుక పరుగులు తీస్తూ, మానసిక ప్రశాంతతను కోల్పోతోంది. స్వార్థం, అసహనం పెచ్చరిల్లుతున్నాయి. ఇటువంటి తరుణంలో కబీర్ బోధనలు కేవలం చదువుకోవడానికి మాత్రమే కాదు, ఆచరించడానికి దిక్సూచిగా మారాలి. తం, కులం, వర్గాల పేరిట విడిపోతున్న మానవాళిని "ప్రేమ, మానవత్వం" అనే ఒకే తాటిపైకి తీసుకురావడమే కబీర్ దాసుకు మనం ఇచ్చే నిజమైన నివాళి. బాహ్య ఆడంబరాలను వదిలి, తోటి మనిషిని ప్రేమించడమే నిజమైన ఆధ్యాత్మికత అని చాటిన కబీర్ మార్గం నిరంతరం అనుసరణీయం.



# అదృశ్య శక్తులు.. కొలతలు



గంగాధర్ బొమ్మకంటి
ఈవార్తలు దినపత్రిక చైర్మన్

ప్రపంచీకరణ, సాంకేతిక విప్లవం, పారిశ్రామిక అభివృద్ధి, పర్యావరణ సంక్షోభాల నడుమ మానవ జీవితాన్ని నిశ్శబ్దంగా ప్రభావితం చేస్తున్న అత్యంత కీలక శాస్త్రం "మెట్రాలజీ" లేదా కొలతల శాస్త్రం. ప్రతి సంవత్సరం మే 20న నిర్వహించే ప్రపంచ మెట్రాలజీ దినోత్సవం కేవలం శాస్త్రీయ కార్యక్రమం మాత్రమే కాదు; అది మానవ నాగరికతకు ఆధారమైన ఖచ్చితత్వానికి ఇచ్చే గౌరవం. 2026 సంవత్సరానికి అంతర్జాతీయ బరువులు, కొలతల బ్యూరో, యునెస్కో ప్రకటించిన మెట్రాలజీ: బిల్డింగ్ ట్రస్ట్ ఇన్ పాలసీ మేకింగ్ అనే నినాదం ప్రస్తుతం ప్రపంచ పరిస్థితులకు ఎంతో సముచితంగా నిలుస్తోంది. ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు ఖచ్చితమైన కొలతలు, శాస్త్రీయ విశ్లేషణల ఆధారంగా ఉంటేనే ప్రజల్లో నమ్మకం పెరుగుతుందనే సందేశాన్ని ఇది ఇస్తోంది. మెట్రాలజీ చరిత్ర 1875 మే 20న పారిస్‌లో జరిగిన "మీటర్ కన్వెన్షన్"తో కీలక మలుపు తిరిగింది. ప్రపంచ దేశాలు ఏకీకృత కొలతల వ్యవస్థను అంగీకరించడం ద్వారా నేటి అంతర్జాతీయ ప్రమాణాల వ్యవస్థకు పునాది పడింది. అనంతరం 1999లో మే 20ను ప్రపంచ మెట్రాలజీ దినోత్సవంగా ప్రకటించగా, 2024 నుంచి యునెస్కో దీనికి అధికారిక అంతర్జాతీయ గుర్తింపునిచ్చింది. మెట్రాలజీని ప్రధానంగా మూడు విభాగాలుగా విభజిస్తారు. శాస్త్రీయ మెట్రాలజీ కొత్త ప్రమాణాల ఆవిష్కరణలకు, పరిశోధనలకు దోహదపడుతుంది. పారిశ్రామిక మెట్రాలజీ పరిశ్రమల్లో నాణ్యత నియంత్రణకు కీలకం. లీగల్ మెట్రాలజీ మాత్రం ప్రజల రోజువారీ లావాదేవీల్లో న్యాయం జరిగేలా త్రాసులు, కొలత పరికరాలపై పర్యవేక్షణ నిర్వహిస్తుంది. ప్రస్తుత ప్రపంచంలో మెట్రాలజీ పాత్ర అపారంగా పెరిగింది. అంతర్జాతీయ వాణిజ్యం నుంచి వాతావరణ మార్పుల వరకు ప్రతి అంశం ఖచ్చితమైన కొలతలపై ఆధారపడి ఉంది. ఒక దేశంలో కొలిచిన ప్రమాణం ప్రపంచవ్యాప్తంగా ఒకేలా ఉండటం వల్లే గ్లోబల్ ట్రేడ్ సజావుగా సాగుతోంది. అలాగే గ్రీన్‌హౌస్ వాయువుల స్థాయిలను కొలవడం ద్వారా వాతావరణ మార్పులపై శాస్త్రవేత్తలు హెచ్చరికలు జారీ చేయగలుగుతున్నారు. వైద్య రంగంలో మెట్రాలజీ ప్రాధాన్యం మరింత కీలకం. మందుల మోతాదులు, రక్త పరీక్షలు, ఎంఆర్ఐ స్కానింగ్, రేడియేషన్ థెరపీ వంటి ప్రతి ప్రక్రియలో ఖచ్చితత్వం లేకపోతే ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉంది. ఇదే విధంగా కృత్రిమ మేధస్సు, 5జీ/6జీ నెట్‌వర్క్‌లు, స్వయం చలిత వాహనాలు వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలన్నీ సరైన డేటా కొలతలపై ఆధారపడి పనిచేస్తున్నాయి.

భారతదేశం కూడా మెట్రాలజీ రంగంలో వేగంగా పురోగమిస్తోంది. నేషనల్ ఫిజికల్ లాబొరేటరీ దేశానికి ప్రధాన ప్రమాణాల సంస్థగా పనిచేస్తోంది. అంతర్జాతీయ లీగల్ మెట్రాలజీ సంస్థ గుర్తింపు పొందడం వల్ల భారతీయ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్‌లో మరింత విశ్వసనీయత పెరిగింది. డిజిటల్ ఇండియాలో భాగంగా ప్రవేశపెట్టిన ఈమ్యాప్ వంటి వ్యవస్థలు పారదర్శకతను బలోపేతం చేస్తున్నాయి. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న కొద్దీ మెట్రాలజీకి కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. క్వాంటం కంప్యూటింగ్, నానో టెక్నాలజీ వంటి రంగాల్లో అత్యంత సూక్ష్మ స్థాయి కొలతలు అవసరమవుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆధునిక ల్యాబ్‌ల కొరత కూడా ఒక ప్రధాన సమస్యగా ఉంది. దీనికి అంతర్జాతీయ సహకారం, సాంకేతిక బదిలీ అవసరమని యునెస్కో సూచిస్తోంది. మొత్తంగా చూస్తే, కొలతలు కేవలం వ్యాపార లావాదేవీలకు పరిమితమైన అంశాలు కావు; అవి సమాజంలో న్యాయం, పారదర్శకత, విశ్వసనీయతకు ప్రతీకలు. ఖచ్చితమైన కొలతలే శాస్త్రానికి బలం, అభివృద్ధికి పునాది, మానవాళి భవిష్యత్తుకు రక్షణ కవచం.

# మహామహుల వీడ్కోలు వేళ..!

భారతదేశంలో క్రికెట్ కేవలం ఒక ఆట మాత్రమే కాదు.. కోట్లాది మంది ప్రజల భావోద్వేగం. ఆ భావోద్వేగానికి ప్రతి వేసవిలో పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చిన వేదిక ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్). 2008లో ప్రారంభమైన ఈ టి20 లీగ్ ప్రపంచ క్రికెట్ ముఖచిత్రాన్నే మార్చేసింది. ఆటను వినోదంతో మేళవించి కోట్లాది అభిమానులను సంపాదించుకుంది. కానీ ఇప్పుడు 2026 ఐపీఎల్ ముగిసే సమయానికి ఒక మహా శకం ముగియబోతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఎన్నో సంవత్సరాలుగా అభిమానులను అలరించిన దిగ్గజ ఆటగాళ్లు నెమ్మదిగా వెనక్కి తగ్గుతుండగా, కొత్త తరం ఐపీఎల్‌ను ఏలేందుకు సిద్ధమవుతోంది.



వినోద్ కుమార్




ఐపీఎల్ విజయానికి ప్రధాన కారణం కేవలం భారీ డబ్బు, గ్లామర్ మాత్రమే కాదు. మైదానంలో తమ ఆటతో అభిమానుల హృదయాలను గెలుచుకున్న మహామహులు. మహేంద్ర సింగ్ ధోని, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రవీంద్ర జడేజా వంటి ఆటగాళ్లు ఐపీఎల్‌కు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చారు. సీఎస్‌కే అంటే ధోని, ఆర్సీబీ అంటే కోహ్లీ, ముంబై ఇండియన్స్ అంటే రోహిత్ అనే స్థాయికి అభిమానుల్లో అనుబంధం ఏర్పడింది. వారి ఆటను చూసేందుకు మాత్రమే స్టేడియాలకు వచ్చే అభిమానులు కోట్లలో ఉన్నారు. ధోని నాయకత్వంలో చెన్నై సూపర్ కింగ్స్ ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటిగా నిలిచింది. ఒత్తిడిలో ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకోవడం, చివరి వరకు పోరాడే ధోరణి ధోనిని ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టాయి. 2026 సీజన్‌లో ధోని మైదానంలో కనిపించిన ప్రతిసారి అభిమానుల్లో భావోద్వేగం స్పష్టంగా కనిపించింది. "ఇదే చివరి సీజన్ కావొచ్చు" అనే భావన చెపాక్ స్టేడియంను కన్నీటి వాతావరణంలోకి నెట్టింది.

విరాట్ కోహ్లీ కూడా ఐపీఎల్ చరిత్రలో ప్రత్యేక అధ్యాయం. ట్రోఫీ గెలవకపోయినా ఆర్సీబీ అభిమానుల ప్రేమను ఎప్పటికీ కోల్పోలేదు. అతని ఆవేశం, ఫిట్‌నెస్, పోరాటస్ఫూర్తి యువతకు ఆదర్శంగా నిలిచాయి. రోహిత్ శర్మ నాయకత్వంలో ముంబై ఇండియన్స్ ఐదు టైటిళ్లు గెలిచి ఐపీఎల్‌లో ఒక సామ్రాజ్యంలా ఎదిగింది. పెద్ద మ్యాచ్‌ల్లో ప్రశాంతంగా జట్టును ముందుకు నడిపించడం రోహిత్ ప్రత్యేకత. రవీంద్ర జడేజా వంటి ఆల్‌రౌండర్లు ఐపీఎల్‌లో ఫీల్డింగ్, సమగ్ర ఆటకు కొత్త ప్రమాణాలు తీసుకొచ్చారు. అయితే ప్రతి ముగింపులో ఒక కొత్త ఆరంభం ఉంటుంది. ఇప్పుడు అదే ఐపీఎల్‌లో కనిపిస్తోంది. శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, తిలక్ వర్మ, రింకూ సింగ్, అభిషేక్ శర్మ వంటి యువ ఆటగాళ్లు కొత్త యుగానికి ప్రతీకలుగా ఎదుగుతున్నారు. భయంలేని బ్యాటింగ్, వేగవంతమైన ఆట, దూకుడు వారి ప్రధాన లక్షణాలు. ఒకప్పుడు 180 పరుగులు భారీ స్కోర్‌గా భావించేవారు. ఇప్పుడు 250 పరుగులు కూడా సురక్షితం కాదనే పరిస్థితి వచ్చింది. ఇది కొత్త తరపు ఆట తీరు. శుభ్‌మన్ గిల్ ఇప్పటికే భారత క్రికెట్ భవిష్యత్తుగా గుర్తింపు పొందాడు. క్లాసిక్ బ్యాటింగ్‌తో పాటు ఆధునిక టి20 దూకుడును కలిపి ఆడుతున్నాడు. యశస్వి జైస్వాల్ భయంలేని ఆటతో బౌలర్లపై ఆధిపత్యం చూపిస్తున్నాడు. రింకూ సింగ్ చివరి ఓవర్లలో మ్యాచ్ ముగించే శైలి అభిమానులకు పాత తరం ఫినిషర్లను గుర్తుచేస్తోంది. తిలక్ వర్మ స్థిరత్వం, అభిషేక్ శర్మ దూకుడు కూడా కొత్త తరానికి బలం.

ఇప్పుడు ఐపీఎల్ సంస్కృతిలో కూడా భారీ మార్పు కనిపిస్తోంది. సోషల్ మీడియా ప్రభావంతో ఆటగాళ్లు కేవలం క్రికెటర్లు మాత్రమే కాదు.. గ్లోబల్ బ్రాండ్లుగా మారిపోయారు. ఒక్క షాట్, ఒక్క క్యాచ్, ఒక్క రియాక్షన్ కూడా క్షణాల్లో వైరల్ అవుతోంది. అభిమానులతో ఆటగాళ్ల అనుబంధం పెరుగుతున్నప్పటికీ, ఒత్తిడి కూడా అదే స్థాయిలో పెరుగుతోంది. ఫ్రాంచైజీలు కూడా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని యువ ఆటగాళ్లపై పెట్టుబడులు పెడుతున్నాయి. గుజరాత్ టైటాన్స్ గిల్ చుట్టూ జట్టును నిర్మిస్తుండగా, రాజస్థాన్ రాయల్స్ యువ భారతీయ ఆటగాళ్లకు ప్రాధాన్యం ఇస్తోంది. ముంబై ఇండియన్స్ కొత్త ప్రతిభను తయారు చేసే వేదికగా మారింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ దూకుడైన ఆటగాళ్లను ప్రోత్సహిస్తోంది. అయితే ఈ మార్పు మధ్య ఒక ఆందోళన కూడా ఉంది. సంప్రదాయ క్రికెట్ విలువలు తగ్గిపోతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. టెక్నిక్ కంటే పవర్‌కు ఎక్కువ ప్రాధాన్యం పెరుగుతోంది. సహనం తగ్గిపోతోంది. అందుకే కొత్త తరం ఆటగాళ్లు పాత తరం నుంచి నాయకత్వం, క్రమశిక్షణ, ఒత్తిడిని ఎదుర్కొనే నైపుణ్యాలను నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. 2026 ఐపీఎల్ ముగిసే సమయానికి అభిమానుల కళ్లలో ఆనందం కంటే భావోద్వేగమే ఎక్కువగా కనిపించే అవకాశం ఉంది. ఎందుకంటే వారు కేవలం ఆటగాళ్లకు మాత్రమే కాదు.. తమ బాల్యం, తమ జ్ఞాపకాలలో భాగమైన ఒక మహా శకానికి వీడ్కోలు పలకబోతున్నారు. ధోని హెలికాప్టర్ షాట్, కోహ్లీ ఆవేశం, రోహిత్ టైమింగ్, జడేజా ఫీల్డింగ్ - ఇవన్నీ ఐపీఎల్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

అయితే క్రీడల అందం కూడా ఇదే. ఒక తరం వెళ్తే మరో తరం వస్తుంది. హీరోలు మారినా, అభిమానుల ప్రేమ మాత్రం మారదు. 2027 తర్వాత ఐపీఎల్ కొత్త ముఖాలతో, కొత్త శైలితో ముందుకు సాగవచ్చు. కానీ ఈ లీగ్‌పై కోట్లాది అభిమానుల భావోద్వేగం మాత్రం ఎప్పటికీ అలాగే ఉంటుంది. ఐపీఎల్ 2026 కేవలం మరో సీజన్ కాదు. అది ఒక యుగాంతం. అదే సమయంలో కొత్త యుగానికి ఆహ్వానం కూడా..!

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.